ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 10 మార్చి 2024 | 5





ఎంపీ ఫొటోతో ఉన్న గిఫ్ట్ బాక్స్.. అందులో ఉన్న చీర



కలిసిన కమలం

ఇక వైసీపీకి మూడింది!

- టీడీపీ-జనసేన..బీజేపీ పొత్తు
- కేడర్‌లో జోష్..వైసీపీకి వెన్నులో వణుకు
- రాజమహేంద్రవరం లోక్‌సభ బీజేపీకే
- పురందేశ్వరి పోటీ చేసే అవకాశం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తు ఖరారైంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది.ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తమ పార్టీ ముఖ్యనేతలకు పొత్తు ఖరారైనట్టు స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే.రాష్ట్ర వ్యాప్తంగా ఆరు అసెంబ్లీ, ఐదు పార్లమెంట్ స్థానాలు బీజేపీకి ఇస్తున్నట్టు ప్రకటించారు. బీజేపీ కోరిన స్థానాల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం కూడా ఉన్న సంగతి తెలిసిందే. మూడు పార్టీల పొత్తుతో జిల్లాలో జోష్ పెరిగింది.అధికార వైసీపీలో మరింత వణుకు మొదలైంది.ఇప్పటికే ప్రజావ్యతిరేకత, వైసీపీలోనే అసమ్మతి, ఒకరి మధ్య ఒకరికి మాట కుదరక పోవడం, అభ్యర్థుల మార్పులు వంటి వాటితో సతమతమవుతున్న వైసీపీకి టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు మరింత వణుకు పుట్టిస్తోంది.టీడీపీ - జనసేన పొత్తుతోనే వైసీపీ అధిష్ఠానానికి ఏం చేయాలో తోచడంలేదు.గెలుస్తామో లేదోననే ఆందోళనలో ఉన్నారు. దీనిలో భాగంగానే ముందస్తుగానే ఓటర్లకు వల వేస్తున్నారు. షెడ్యూల్ రాక ముందే తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే ఖర్చుకు అభ్యర్థులు గిజగిలాడిపోతున్నారు.పోలింగ్ సమయంలో ఎంత పంచాలోనని మదనపడుతున్నారు. కానీ ఇప్పటికే బలంగా తయారైన ప్రతిపక్ష టీడీపీ-జనసేనతో బీజేపీ కలవడంతో వైసీపీకి అహసనం పెరిగింది.రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థి గెలిచిన సందర్భాలు ఉన్నాయి. టీడీపీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. 1998లో వాజ్‌పేయి హవాలో బీజేపీ తొలిసారిగా ఇక్కడ ఒంటరిగా పోటీ చేసి గెలిచింది.అప్పుడు టీడీపీ అభ్యర్థి ఎంవీవీఎస్ మూర్తి మీద 9,912 ఓటర్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి గెలిచారు. మళ్లీ 1999లో ఎన్నికలు వచ్చేశాయి.అపుడు బీజేపీ అభ్యర్థి ఎస్‌బీపీబీకె సత్యనారాయణరావు కాంగ్రెస్ అభ్యర్థి చిట్టూరి రవీంద్రపై 60,031 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అపుడు టీడీపీ,బీజేపీ పొత్తు ఉంది. కానీ 2004లో బీజేపీ అభ్యర్థిగా కంటిపూటి సర్వారాయుడు పోటీ చేశారు. ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడంతో బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి ఉండవల్లి అరుణకుమార్ చేతిలో ఓడిపోయారు. 2014లో టీడీపీ-బీజేపీ పొత్తుతో సిటీలో ఎమ్మెల్యేగా ఆకుల సత్యనారాయణ గెలిచారు. 2019లో పొత్తులేదు. మళ్లీ ఇవాళ పొత్తు ఉండడంతో వారి బలం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ కేడర్‌తో పాటు వారికి మద్దతు ఇస్తున్న టీడీపీ జనసేన కేడర్‌లోనూ జోష్ పెరిగింది. వైసీపీ ప్రభుత్వ వైఖరి వల్ల విసిగిపోయిన ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కానీ టీడీపీ నుంచి టికెట్ ఆశించిన నేతలకు కాస్త ఇబ్బంది అయినా, పొత్తు ధర్మం వల్ల వారు కూడా సంతోషాన్నే వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు భాషను భావితరాలకు చేర్చాలి
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 7

ప్రలోభాలతో.. సిద్ధం!



ఎన్నికల వేళ..తాయిలాలతో వల

జగన్ సిద్ధం.. సిద్ధం అంటుంటే ఓటర్లు ఎందుకో అనుకున్నారు.. ఇంతకీ తాయిలాలకు అని తెలియదు.. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ రాకుండానే వైసీపీ నాయకులు తాయిలాలతో రోడ్డెక్కుతున్నారు.. మాకే ఓటేయండి అంటూ ఇంటింటికి తిరుగుతూ చీరలు పంపిణీ చేస్తున్నారు.. రాజమహేంద్రవరం నారాయణపురం వాంబే కాలనీలో శనివారం చీరలు పంపిణీ చేశారు. ఇవెక్కడ నుంచి వచ్చాయంటే మాత్రం.. వైసీపీ అధిష్ఠానమే పంపినట్టు చెబుతున్నారు.. ఇంతకీ తాయిలాలు ఇవ్వడానికి సిద్ధమా అని తెలిసి ఓటర్లు నివ్వెరపోతున్నారు...

- అదే పనిగా ప్రలోభాల పర్వం
- నాలుగేళ్లుగా లేని కపట ప్రేమ
- ఓట్ల 'పండుగ' వేళ 'చీర'ల రూపంలో
- బహిరంగంగా..దర్జాగా పంపిణీ
- ఎంపీ బొమ్మతో ప్రచారం
- ఓటుంటేనే చీర అందజేత
- పెద్ద సంఖ్యలో పేద వార్డులపై కన్ను
- ఓటరు, ఆధార్ కార్డు ప్రామాణికం
- వైసీపీ కుర్రాళ్ల మోహరింపు

రాజమహేంద్రవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జగన్ బటన్ మాటున ఐదేళ్ల పెట్టిన తిప్పలు జనాలు గ్రహించేశారని అనుకున్నారో.. ఓటర్ల 'గాలి' మళ్లిందనే విషయం బోధపడిందో..ప్రచారం కోసం అమలు చేస్తున్న 'పథకాలు' పారలేదని తేలిపోయిందోగానీ వైసీపీ నాయకులు మాత్రం ప్రలోభాల పంపిణీనే నమ్ముకున్నట్లుగా పరిస్థితులు కానవస్తున్నాయి. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకుండానే చీరలు,ప్యాంట్లు, షర్టులు తెచ్చి మహిళల చేతిలో పెట్టేస్తున్నారు. అసలు ఇంత భారీ సంఖ్యలో పంచిపెడుతున్నారంటే అవన్నీ ఎప్పుడు కొనుగోలు చేశారనే విషయంపై చర్చ నడుస్తోంది. ప్యాను పని అయిపోందంటూ


పంచడానికా సిద్ధం : రాజమహేంద్రవరం నారాయణపురం వాంబే కాలనీలో వైసీపీ నాయకులు పంపిణీ చేసిన చీర చూసుకుంటున్న మహిళలు

సర్వేలు గత కొద్ది నెలలుగా ఘోషిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రలోభాల కోసం బహుమతులను ముందుగానే 'సిద్ధం' చేసుకున్నారని తెలుస్తోంది.నాలుగేళ్లుగా పండుగల వేళ కూడా అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు గుర్తుకురాలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాత్రం 'చీరల రూపంలోని తాయిలాలతో మహిళలపై వైసీపీ నాయకులకు కపట ప్రేమ ఉప్పొంగిపోతోంది. జిల్లా అంతటా ఎక్కడ చూసినా చీరల పంపిణీ జోరుగా సాగుతోంది. మరికొన్ని చోట్ల కుక్కర్లు, సీలింగ్ ఫ్యాన్లు,డిన్నర్ సెట్లు ముట్టజెప్పి ఓటును దండుకుంటున్నారు.మంత్రి వేణు ఏకంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సమాచార శాఖ వాహనంలోనే ప్రలోభాల బహుమతులను తరలించి అధికార దుర్వినియోగానికి పాల్పడడం చూసి బరితెగింపు కూడా నివ్వెరపోయిందట.

ఇన్నేళ్లుగా ఏమైపోయింది!

వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు 'ఓ సారి చూద్దామని' కట్టబెట్టిన అధికారానికి దాదాపు మరో రెండు నెలల్లో ఆయుష్షు తీరుతుంది.ఈ ఐదేళ్లలో అక్కాచెల్లెమ్మల ఇంటికి వెళ్లి కష్టసుఖాలు తెలుసుకున్న వైసీపీ నాయకుడు లేడు. ఆ పార్టీ అధినేత మరీ దారుణం. ఎక్కడో ఓ చోట సభ పెట్టడం.. భద్రతా వలయంలో వచ్చి బటన్ నొక్కి నాలుగు కల్లబొల్లి కబుర్లు వల్లెవేసి జారుకోవడం అందరికీ సుపరిచితమే. అంగన్వాడీలు, ఆశాలు, టీచర్లను రోడ్డెక్కించి మరీ ఆయన పెట్టిన ముప్పుతిప్పలు అన్నీఇన్నీకావు. వైసీపీ నాయకులు కూడా అదే మార్గాన్ని అనుసరించారు. తమకు 'లాభం' చేకూరే పనుల్లో ఈ ఐదేళ్లూ బిజీ అయిపోయారు. వార్డుల్లో తిరిగిన పాపాన పోలేదు. గ్రామాల్లోని మహిళలు చిన్న ధ్రువపత్రానికి కూడా నానా కష్టాలూ పడ్డారు. ప్రతి పనికీ ఓ రేటు పెట్టి మరీ దండుకున్నారు. వైసీపీ నాయకులకు ముడుపులు ముట్టజెప్పిన తర్వాత అధికారులకు ఫోను వెళితేనే సంతకం చేసేవాళ్లు. ఈ ఐదేళ్లలో ఎన్నో పండుగలు వచ్చాయి. కానీ ఎప్పుడూ వైసీపీ నాయకులు ఊరు ఊరంతా చీరలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల వేళ మాత్రం పండుగలకూ ప్రలోభాలను పులిమేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా పండుగల పేరు చెప్పి మహిళలకు చీరలు పంచిపెడుతున్నారు. ఒక్కో ఏరియాలో ఒక్కో సమయంలో చీరల పంపిణీ జరుగుతోంది. ముందు రోజున ఆయా ప్రాంతాల్లోని చోటామోటా నాయకులు వీధుల్లో తిరిగి రేపు చీరలిస్తామని చెబుతున్నారు. ఆ మేరకు సన్నద్ధం చేసి.. మరుసటి రోజున చీరలను చేతిలో పెడుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఈ తంతు నిర్విరామంగా నడుస్తోంది. ఇదంతా ఎన్నికల స్టంటు అని సామాన్య ప్రజానీకం ఇప్పటికే గ్రహించారు. దీంతో కొందరు మహిళలు చీరలు తదితర బహుమతులను తిరస్కరిస్తున్నట్లు సమాచారం.

కార్డులు చూసి..బరి తెగింపు..

కొద్ది రోజుల నుంచి వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ఆశాలు, అంగన్వాడీ వర్కర్లకు తాయిలాల పంపిణీ జరిగింది. నయానో, భయానో వారిని ముందుగా సన్నద్ధం చేశారు. ఇప్పుడు వీధుల్లో పంపిణీ మొదలైంది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో కొన్ని వార్డుల చొప్పున ప్రతి రోజూ చీర తాయిలం ఇళ్లకు ఇస్తున్నారు. శనివారం ఒకటి నుంచి పది వార్డులను నిర్దేశించుకున్నారు. దీనిలో భాగంగా ఆయా ప్రాంతాలకు ఆటోల్లో చీరల బేళ్లను తరలించారు. వాటిని సిట్టింగ్ ఎంపీ మార్గాని భరత్‌రామ్ బొమ్మ ఉన్న బాక్సుల్లో పెట్టి,దానిని ఆయన చిత్రాలు ఉన్న కవర్లలో ఉంచి ఇస్తున్నారు. ఈ పంపిణీకి ప్రభుత్వ యంత్రాంగాన్ని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. అయా వార్డుల్లోని స్థానిక యువత వెంట సచివాలయ సిబ్బంది, వలంటీరు వెళుతున్నారు. ఓటరు లిస్టులో పేరు వెరిఫై చేసిన తర్వాత సదరు మహిళ ఓటరు కార్డు, ఆధార్ కార్డు చూస్తున్నారు.ఆ వివరాలను ఓటరు లిస్టుతో సరిపోల్చుకొని చీరను చేతిలో పెడుతున్నారు. ఈ ప్రలోభాల పంపిణీకి కొన్ని పేదలు, మధ్యతరగతి జీవులు ఉండే ప్రాంతాలను ఎంచుకొన్నారు. ధనికులు ఉండే ప్రాంతాల్లో బాగా గుట్టుగా వ్యవహారం నడుస్తోంది. ఎక్కడైనా ఈ ప్రలోభాల పంపిణీని ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు అడ్డుకుంటారనే భయంతో.. మీడి యా వల్ల ప్రజలకు అసలు నిజం తెలిసిపోతుందనే ఆందోళనతో కొందరు కుర్రాళ్లతో ఈ తంతు నడిపిస్తున్నారు. ఎవరైనా అడ్డుపడితే చితక్కొట్టండనే మౌఖిక ఆదేశాలు ఆయా నేతల నుంచి ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో చీరల పంపిణీ ప్రదేశంలో వైసీపీ కుర్రాళ్లు మోహరిస్తున్నారు. ఎవరైనా కొత్తవాళ్లు వెళ్తే వారు ఎవరని ఆరా తీస్తున్నారు. ఫొటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నిస్తే రెచ్చిపోతున్నారు.

తర్వాత సుద్ధపూసలమంటూ..

ఎన్నికల నోటిఫికేషన్ బాగా దగ్గరకు వచ్చేసింది. ఏ క్షణంలోనైనా ఏపీలో ఎన్నికల పోరుపై ఎన్నికల సంఘం ప్రకటన చేసే అవకాశం ఉంది. ఒకసారి నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేస్తుంది. ఎన్నికల సంఘం పరిశీలకులు రంగంలోకి దిగుతారు. ఎన్నికలకు అభ్యర్థులు చేస్తున్న ఖర్చులను లెక్కలు వేస్తారు. వారి ఎన్నికల వ్యయ జాబితాలో చేరుస్తారు. బిల్లులు, రవాణా అనుమతులు, ఉద్దేశం వంటివీ పక్కాగా ఉండాలి. అందువల్ల నోటిఫికేషన్ రాకకు ముందే ఏదోక పర్వదినం పేరుజెప్పి ప్రలోభాల పంపకానికి వైసీపీ నాయకులు తెరతీశారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా వైసీపీ షాడో అధినేత మాదిరిగా వ్యవహరిస్తున్న 'ఐప్యాక్' చెప్పిన విధంగా 'పంపిణీ'లు జరుగుతున్నాయి. కొద్ది నెలల నుంచే కొనుగోలు, రవాణా, ఆయా ప్రాంతాలకు చేర్చడం వంటి పనులు చేపట్టారు. వాటిని ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందే 'సర్దేయాలని' ఆదేశించారని తెలుస్తోంది. దీంతో ముందుగా మీడియా, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీలు, ఆశాలు, వలంటీర్లను పంపిణీ చేసి తర్వాత ఇప్పుడు వీధికెక్కారు.


కొవ్వవరంలో వలంటీర్లను సన్మానించి చీరను అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తిలో పన్నుల ముసుగు

అనపర్తి, మార్చి 9 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీ నాయకులు బరి తెగిస్తున్నారు. తాయిలాలతో వల వేస్తున్నారు. అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలో శుక్రవారం వలంటీర్లకు సత్కారాలు చేసి బహుమతులు అంద జేయడం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో నూరు శాతం ఇంటి పన్నులను 14 రోజుల్లో వంద శాతం వసూలు చేయడంతో వలంటీర్లను ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా సత్కరించామని పంచాయతీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇదంతా మూడు నెలల కిందటే జరగ్గా నేడో రేపో నోటిఫికేషన్ వస్తున్న తరుణంలో సత్కారాలు చేయడం బహుమతులు అందించడం ప్రలోభాల కిందకు వస్తుందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు.

ఎంపీగారు మాకో!

పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే వారిని ఎంపీ అంటారని తెలిసిందే. కానీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గానికి మాత్రం అనధికార ఎమ్మెల్యే ఉన్నట్టుగా వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ పరిస్థితి ఉంది.ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లోకి రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం శాసన సభ నియోజకవర్గాలు వస్తాయి. అయితే ముందు నుంచీ ఎంపీ భరత్ రామ్ రాజమహేంద్రవరం సిటీపైనే కర్చీఫ్ వేసి కూర్చు న్నారు.మిగతా నియోజకవర్గాలను పెద్దగా పట్టించుకో లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు చీరల పంపిణీ విషయంలోనూ అదే జరుగుతోంది.దీంతో గత ఎన్నికలతో తమతో అవసరం తీరిపోయిందంటూ ఆరు నియోజకవర్గాల అక్క చెల్లెమ్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గాలి చీరల వలలో పడొద్దంటూ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ నారీమణులకు సలహా ఇస్తున్నారు. వాస్తవానికి ఈ ఐదేళ్లలో పార్లమెంటు సెగ్మెంటులోని ఏడు నియోజకవర్గాల్లో ఏ ఒక్క నియోజకవర్గంలో మహిళలకు కూడా ఏ పర్వదినాలకూ ఇంత పెద్ద మొత్తంలో ఎంపీ భరత్‌రామ్ చీరలు పంపిణీ చేసిన సందర్భాలు లేవు.అయితే రాజమహేంద్రవరం సిటీ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీలో ఉండాలని భరత్ కోరుకుంటున్నారు. అందువల్ల సిటీలో మహిళలకు చీరలవల విసురుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

ఓటమి భయంతోనే చీరల పంపిణీ

రెడ్డి మణేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు



రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ రానున్న ఎన్నికల్లో ఓటమి చెందుతామనే భయం పట్టుకుంది. అందుకే ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రారంభించాడు. నగరంలో అన్నిడివిజన్లలో మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నాడు. అతను నగరంలో చేసిన అభివృద్ధి నిజమే అయితే మహిళలకు చీరలు పంచిపెట్టాల్సిన అవసరం ఏముంది. ఇటువంటి విధానాలు హర్షించదగ్గవి కాదు. ప్రజలే తగిన బుద్ధిచెబుతారు.

హోం మంత్రి వనిత విందు..

దేవరపల్లి, మార్చి 9 : వైసీపీ నాయకులు ఏ వర్గాన్ని వదలడం లేదు. మీడియాను తమ గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల వేళ హోం మంత్రి తానేటి వనిత గోపా లపురం యర్నగూడెంలోని కల్యాణమండపంలో శని వారం సాయంత్రం నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆహా అనిపించేలా విందు ఏర్పాటు చేశారు. విలేకరులందరినీ పేరు పేరునా పరిచయం చేసుకున్నారు. అనంతరం కుక్కర్, చీర, షర్టు ప్యాంట్ ఇచ్చారు. మీరంతా సహకరించాలని కోరారు.


కణుపూరుకొండపై పంచముఖ మల్లికార్జున స్వామి

కణువూరు తీర్థం ప్రారంభం

5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహణ

కోరుకొండ, మార్చి 9 : కోరుకొండ మండలం కణుపూరు తీర్థం శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కణుపూరు కొండపై స్వయంభుగా వెలిసిన పంచముఖ మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు చేశారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి 64వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొండపైన కొండ దిగువన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.శనివారం స్వామి వారిని జనసేన, టీడీపీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకట లక్ష్మి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కొండపైన, కొండ దిగువున స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం కొండ దిగువున 5రోజులు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జగన్ మాయ
ఇదేనా సంక్షేమం



ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు టెన్షన్ తప్పదా?

- మరో 10 రోజుల్లో పది పరీక్షలు
- ఈ ఏడాది 200 మంది హాజరు
- ట్యూటర్లు ఉన్నట్టా ? లేనట్టా ?
- ముందుకు సాగని చదువు
- నేటికీ అందని పౌష్టికాహారంలేదు..
- టెన్త్ నూరుశాతం గట్టెక్కడం దైవాదీనం ?
- ఆందోళనలో తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 9 : ప్రభుత్వ తీరుతో విద్యార్థులకు ఒత్తిడి తప్పడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పదవ తరగతి విద్యార్థులు ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించేవారు. దాతల సహకా రంతో పౌష్టికాహారం అందజేసేవారు. మరి నేడు పౌష్టికాహారం లేదు.. చదువుల ఊసే లేదు. ప్రతి విద్యార్థి కెరీర్‌లో 10వ తరగతి అత్యంత కీలకమైనదనే చెప్పాలి. టెన్త్‌లో సంపాదించుకునే మార్కులు భావి జీవితంలో వారిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి మెట్లుగా ఉపయోగపడతాయి. ఇంటర్‌లో ప్రవేశాలు మొదలుకుని ఉద్యోగాల వేటలో వారికి ఊతకర్రగా నిలుస్తాయి. అలాంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన టెన్త్ చదువుల విషయంలో ఎస్సీ హాస్టళ్లలోని విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందనే చెప్పాలి.

18 నుంచే పరీక్షలు

ఈ నెల 18వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. పరీక్షలకు హాజరవుతున్న టెన్త్ విద్యార్థులకు హాస్టళ్లలో ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు, ఏర్పాట్లు లేవు. పౌష్టికాహారం ఊసేలేదు. సాధారణ మెనూతోనే సరిపెడుతున్నారు. నలుగురితో పాటు ... అన్న చందంగా హాస్టళ్లలో ఉంటూ పబ్లిక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. పాఠాలను పునశ్చరణ చేయడానికి, ఏమైనా సందేహాలు వస్తే తిరిగి బోధించడానికి సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పూర్తిస్థాయిలో ట్యూటర్లను ఏర్పాటు చేయలేదు. మోటివేషన్ క్యాంపులు నిర్వహించకపోవడం, ఇతర అభ్యసన ప్రక్రియలు చేపట్టకపోవడం ఎస్సీ హాస్టళ్లలోని టెన్త్ విద్యార్థులకు శాపంగా మారుతోంది. తాము చదివే స్కూళ్లలో మాస్టార్లు చెప్పే పాఠాలు విని రావడం తప్ప హాస్టళ్లలో ప్రత్యేక బోధనా తరగతులు లేవనే చెప్పాలి. దీంతో తమ పిల్లలు పబ్లిక్ పరీక్షలు ఎలా రాస్తారో అనే బెంగ విద్యార్థుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో గతేడాది 162 మంది టెన్త్ పరీక్షలకు హాజరైతే 128 మంది మాత్రమే పాసయ్యారు. 34 మంది పరీక్షలు తప్పారు. కనీసం పాస్ మార్కులతో కూడా విద్యార్థులు పాస్ కాలేదంటే సాంఘిక సంక్షేమశాఖ అధికారుల పర్యవేక్షణ, వారిపై శ్రద్ధ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.ఈ ఏడాది టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు దైవాధీనం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది 200 మంది పైగా..

కొద్దిరోజుల్లో జరగబోయే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల నుంచి 200 మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో ఎంతమంది పాస్ అవుతారనేది చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే గతేడాది ఫలితాలను చూస్తే ఈ ఏడాది ఏం జరుగుతుందో ఇట్టే అర్థం అవుతుందని చెబుతున్నారు. ఈ ఏడాది కూడా టెన్త్ విద్యార్థుల పట్ల సాంఘిక సంక్షేమ అధికారులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, కార్యాచరణ కనిపించడం లేదనే చెబుతున్నారు. లెక్కలు, ఇంగ్లీషు, సైన్స్ హిందీ సబ్జెక్టులకు ట్యూటర్లను పెట్టామని సాంఘిక సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నా ఎంత మందిని ఏయే హాస్టళ్లలో పెట్టారనేదానిపై సమాచారం లేదు.చాలా హాస్టళ్లలో ట్యూటర్లు లేరని సమాచారం.దీంతో స్కూళ్ల నుంచి సాయంత్రం హాస్టల్‌కు వచ్చిన టెన్త్ విద్యార్థులు పుస్తకాలు చూసి చదువుకోవడం మినహా మరో గత్యంతరం లేకుండా ఉంది.ఈ పరిస్థితుల్లో టెన్త్ విద్యార్థుల నూరుశాతం ఉత్తీర్ణత పై ఈ ఏడాదీ నిరాశ తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మహిళలకు ఆరోగ్యానివ్వండి..

మహిళా వైద్యులకు కలెక్టర్ మాధవీలత సూచన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 9 : స్త్రీ శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం అవ్వడమే మహిళాసాధికారితకు నిజమైన నిదర్శనం అని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం వై.జంక్షన్ వద్ద ఐఎంఏ మహిళా విభాగం వైద్యులు ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. భారత దేశంలో ఇతిహాస, పురాణ కాలం నుంచి మహిళలకు సముచితస్థానం లభిస్తున్నదన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళా వైద్యులు స్త్రీలకు ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల వారిలో అవగాహన కలుగజేసే కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీలో వైద్యులు డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ పద్మజ, డాక్టర్ ప్రేమలత, డాక్టర్ కాంతితేజ, డాక్టర్ రాధిక, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివోహం



శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ పలువురు భక్తులు జాగారం చేశారు. దీంతో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. దీనిలో భాగంగా నిడదవోలు పంచాయతన క్షేత్రం సోమేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం ఆకట్టుకుంది.

తెలుగు భాషను భావితరాలకు చేర్చాలి

భాషపై సానుకూల దృక్పథం కలిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలి

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

కాకినాడలో ప్రారంభమైన అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు

దేశవిదేశాల నుంచి సాహితీవేత్తలు హాజరు



వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న ప్రముఖులు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 9: భావితరాలకు తెలుగు భాష సంస్కృతి పట్ల సానుకూల దృక్పథం కలిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. తెలుగు భాష అమ్మపాల వంటిదన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా కన్న తల్లి, మాతృభాష, మాతృదేశాన్ని మరువకూడదని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణ కోసం వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో దంటు కళా క్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే సదస్సును శనివారం మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో వెంకయ్యనాయుడు మాట్లా డారు. ఆట, పాట, కట్టు, బొట్టు, సంస్కృతి తెలుగు భాష విశిష్టతను తెలియజేస్తాయని వివరించారు. రాబోయే తరాలకు ప్రతిఒక్కరూ సాహిత్య పరిమళాలను అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నన్నయ్య, తిక్కన, శ్రీనాథుడు, పోతన వంటి వారు తెలుగు సాహిత్యానికి ప్రాణం పోశారని గుర్తు చేశారు. అన్నమయ్య, భర్తృహరి లాంటి వారు అచ్చ తెలుగు పదాలతోనే గేయాలు, కవితలు రాశారని చెప్పారు. రాచరికంలో రాజులు కవులను ప్రోత్సహించిన


ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

విధంగానే, నేటి ప్రభుత్వాలు భాషాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. మమ్మి, డాడీ సంస్కృతి పోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలతో అమ్మానాన్న అని పిలిపించు కోవాలని అన్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను బతికించుకునేందుకు సాహితీ సదస్సు నిర్వహించడం అభినంద నీయ మన్నారు. భాషాభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. శాసనసభ మాజీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లా డుతూ తెలుగుభాష పరిరక్షణకు మరిన్ని సదస్సులు నిర్వహించాలని ఆకాంక్షించారు. సాహితీవేత్తలంతా ఒకచోట హాజరై తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం సంతోషకరమని చెప్పారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు మాట్లాడుతూ సదస్సు కోసం దేశ, విదేశాల నుంచి సాహితీవేత్తలంతా తరలిరావడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నాలుగు పుస్తకాలను ముఖ్య అతిథి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్స్‌కు చెందిన డేనియల్ నేజర్, డాక్టర్ వంశీ రామరాజు, మంగిపూడి రాధిక, ఎర్రాప్రగడ రామకృష్ణ, వైఎస్ఎన్ మూర్తి, పతంజలిశాస్త్రి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, భువనచంద్ర తదితరులు తమ అభిప్రాయాలను చర్చావేదిక రూపంలో అందించారు. సదస్సుకు 100 మందికి పైగా సాహితీవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు మార్ని జానకీరామ్‌చౌదరి, కె.గౌరీనాయుడు, మణిబాబు పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్‌కు జ్ఞాపిక బహూకరణ

అప్పనపల్లిలో భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, మార్చి 9: భక్తుల తాకిడితో అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. కొత్త, పాత గుడులు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 3459మంది దర్శించుకుని 2571 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,35,039 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం, మార్చి 9: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 3,63,450 అన్నదాన విరాళాలు రూ. 81,441 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.4,320, తులాభారం రూ.400 వెరసి రూ.4,49,611 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం


రథాన్ని లాగి ప్రారంభిస్తున్న చినరాజప్ప, దొరబాబు

సామర్లకోట, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్ల రథోత్సవం శనివారం సాయ ంత్రం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి పల్లకీపై ప్రదర్శించుకుని గాంధీబొమ్మ సెంటర్‌కు మంగళవాయిద్యాల మధ్య తీసుకుని వచ్చారు. అప్పటికే రథంపై సిద్ధంగా ఉన్న పండితులు చెరుకూరి రాంబాబు, అంజిబాబు, శ్రీనివాస రావు, వినయ్ ఉత్సవమూర్తులను పల్లకీ నుంచి రథం వేదికపై అలంకరించారు. శాస్త్రోక్తంగా గుమ్మడికాయను అన్నం కుంభంపై పగలకొట్టి హారతులు ఇవ్వగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప తాడు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పెద్దాపురం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, కౌన్సిలర్, రథోత్సవ కమిటీ ప్రతినిధి యార్లగడ్డ





జగదీష్, టీడీపీ, వైసీపీ నాయకులు ఆలయ కార్యనిర్వహణాదికారి బళ్ల నీలకంఠం తది తరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం జరిగిన రథోత్సవంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు తదితర ప్రజాప్రతినిధుల సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కోల సంబరం, వీరభద్రుని సంబరం, గోవింద గోవింద నృత్యం, కోబ్రా నృత్యం, తీన్మార్ డప్పుల డ్యాన్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి, బాణసంచా కాల్పులు, మంగళవాయిద్యాల నడుమ వందలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది రథోత్సవాన్ని అనుసరించారు. అంతకుముందు ఉదయం భీమేశ్వరాలయంలో స్వామివారికి అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధూపసేవ నిర్వహించి పల్లకీలో దేవతామూర్తులను అలంకరించి రథోత్సవం వరకూ పల్లకీ సేవ నిర్వహించారు.

వైభవంగా రథోత్సవం




రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, మార్చి 9: పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి రథోత్సవం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవ మూర్తులను ఉంచి కుంతీ మాధవస్వామి కోనేరు నుంచి ఉప్పాడ బస్టాండ్ వరకూ రథాన్ని లాగి సెంటర్‌లో నిలిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను రథంపై దర్శించుకున్నారు. అక్కడ బాణాసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీపై ఉంచి పాదగయ నుంచి నాయకులు ప్రజా ప్రతినిధులు పల్లకీని మోస్తూ కుంతీ మాధవస్వామి దేవస్థానం వరకూ తీసుకువచ్చి అక్కడ రథంపై ఉంచారు.. రథోత్సవంలో కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, సీఐ శ్రీనివాస్, ఉత్సవకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రంగులు చల్లుకుంటున్న అర్చక స్వాములు


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పోలీసులు

సంబరంగా సాగిన నాకబలి..దొంగలతోపు

పిఠాపురం, మార్చి 9: పాదగయ క్షేత్రంలో కుక్కుటేశుని కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం వివిధ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలు చేతపట్టుకుని రంగులు చల్లుతూ నిర్వహించిన కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీసమేత ఉమాకుక్కుటేశ్వస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన జరిగింది. సాయంత్రం నాకబలి-దండియాడింపు-దొంగలతోపు ఉత్సవం ఉత్సాహపూరితంగా సాగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అర్చకులు పరస్పరం రంగులు చల్లుకొన్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకిపై ఉంచి దేవస్థానం నుంచి ప్రదర్శనగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కింగ్‌కాంగ్ డాల్స్, శక్తి వేషధారణలతో కళాకారులు ప్రదర్శించిన విన్యాసాలు భక్తులను అలరించాయి. కార్యక్రమాల్లో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఈవో, సహాయ కమిషనరు పులి నారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారులతో ఎంపీ, ఎమ్మెల్యేలు కోలాటం ఆడారు. పోలీసులు అందరూ ఉత్సవమూర్తులను మోసి కుక్కుటేశుని సేవలో పాలుపంచుకున్నారు.


కోలాహలంగా బాలయోగీశ్వరుల తీర్థం


తపో మందిరం వద్ద భక్తుల సందడి

ముమ్మిడివరం, మార్చి 9: శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తీర్థ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో శనివారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, ప్రత్యేక అభిషేకాలు, హారతులు, దివ్య సమాధుల వద్ద పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మద్రాసు, దేశం నలుమూలల నుంచి భక్తులు భగవాన్ పెదబాలయోగీశ్వరులు, చినబాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు స్వామివారి దివ్య సమాధులను భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు వసతి, భారీ అన్న సమారాధన వంటి వాటిని ఏర్పాటు చేశారు. తపో ఆశ్రమ కమిటీ, కుటుంబ సభ్యులు భక్తులకు అవసరమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, కుడుపూడి శంకరరావులతో పాటు వైసీపీ నాయకులు, జడ్పీటీసీ సభ్యులు బాలయోగీశ్వరుల దివ్య సమాధులు, విగ్రహాలను దర్శించుకుని పూజలు జరిపించారు. జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ, పార్టీ నాయకులు బాలయోగీశ్వరుల దివ్య సమాధులను దర్శించుకున్నారు. ఆయన వెంట దూడల స్వామి, సానబోయిన వీరభద్రరావు, యలమంచిలి బాలరాజు, పితాని రాజు, గొలకోటి సాయి బాబులతో పాటు పలువురు ఉన్నారు.


తీర్థానికి వచ్చిన భక్తులు

కిటకిటలాడిన వాడపల్లి



ఆత్రేయపురం, మార్చి9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంక టేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.46.84 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు


స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

దుర్గాడ శివాలయంలో అభిషేకాలు



గొల్లప్రోలు రూరల్, మార్చి 9: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి కల్యా ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శనివారం అభిషేకాలు నిర్వహించారు. లింగోద్భవకాల అభిషేకంతో పాటు స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పంచదార, పండ్లు, చెరకు రసాలు, విభూది, గంధం, రోజ్ వాటర్ తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. స్వామిని పుష్పాలతో, ఆయా అభిషేక ద్రవ్యాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భావనారాయణస్వామికి వెండి ఆభరణాలు


వెండి ఆభరణాలు తీసుకువస్తున్న దాతలు

సర్పవరం జంక్షన్, మార్చి 9: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి రూ.6.50 లక్షల విలువ చేసే రూ.7.50 కిలోల వెండి ఆభరణాలను భక్తులు సమర్పించారు. కాకినాడకు చెందిన భక్తులు చిక్కాల చౌదరయ్య (తాతాజీ), సత్యపూర్ణలక్ష్మి దంపతులు శనివారం సర్పవరం స్వామివారి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జొన్నాడ భీమశంకరరావుకు రూ.7.50 కిలోలతో తయారు చేయించిన అమ్మవారి కిరీటం, వెండి కర్ణపత్రాలు, కమలా హస్తములు, అభయ హస్తములు, వృక్షస్థలాభరణం, బుట్ట చీరాభరణం, రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి వడ్డాణం, ఉత్సవమూర్తులు శ్రీదేవి భావనా రాయణస్వామికి వెండి వడ్డాణాలను అందజేశారు. వెండి ఆభరణాలు అందించిన చౌదరయ్యసత్యపూర్ణలక్ష్మి దంపతులకు గ్రామస్థుల తరపున ఛైర్మన్ నారాయణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర తెలియజేసే పుస్తకం, స్వామివారి ప్రసాదాన్ని దాతలకు అందించారు.

లింగోద్భవకాల పూజలు

సామర్లకోట, మార్చి 9: మహాశివరాత్రి విశేష పూజలలో భాగంగా శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 2 గంటల వరకూ భీమేశ్వరుని శివ లింగానికి లింగోద్భవకాల పూజలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలను కంచి మహా సంస్థానం వ్యవస్థాపక కుటుంబీకులు చంద్రాభట్ల పతంజలి తదితర పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచ ద్రవ్యములతో అభిషేకించారు. మానస సరోవరం నుంచి తెచ్చిన లక్షలాది పవిత్ర రుద్రాక్షలు స్వామివారిని అభిషేకించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. పూజల అనంతరం రుద్రాక్షలను పతంజలి చేతుల మీదుగా పలువురు భక్తులకు పంపిణీ చేశారు. ఈ పూజలలో పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాస్ విద్యుల్లత దంపతులు, బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చుండ్రు గోపాలకృష్ణ, ఆర్వీ సుబ్బరాజు, గంజి బూరిబాబు, అమలకంటి శ్రీనివాసరావు, గుండు శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం స్వామివారికి త్రిశూలస్నానం, తీర్థపు సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నీలకంఠం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వేట కుక్క దాడిలో కణుజు మృతి


పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

తుని రూరల్, మార్చి 9: వేట కుక్క దాడిలో కణుజు హతమైంది. కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవ సమీపంలో కొండ దిగువకు కణుజు వచ్చింది. కుమ్మరిలోవ ఎన్ఎస్‌వీ నగరం, ఎన్.సూరవరం, కొలిమేరు ప్రాంతాలను ఆనుకుని ఉన్న పచ్చటి కొండల్లో వన్యప్రాణులు తలదాచుకుంటున్నాయి. అయితే వీటిపై అధికార పార్టీకి చెందినఒక వేటగాడు కన్ను పడటంతో ఆ ప్రాంతంలో యథేచ్ఛగా వన్యప్రాణులను వేటాడుతున్నట్లు తెలిసింది. ఈ కోవలోనే కణుజును కుక్కలు వేటాడి హతమార్చి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు కుమ్మరిలోవ సమీపంలో వేటకుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లి, పిల్ల కణుజు కుమ్మరిలోవ ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే స్థానికులు వాటిని గమనించి కాపాడే ప్రయత్నం చేశారు. స్థానికుల రాకతో పిల్ల కణుజు కొండపైకి వెళ్లగా, తల్లి కణుజు గాయాలతో పడి ఉంది. స్థానికులు కాపాడే ప్రయత్నం చేయగా కొద్ది సేపటికే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. కేసు నమోదు చేసి, కణుజును ఖననం చేసినట్లు ఎఫ్ఎస్‌వో రాంబాబు తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మొరాయిస్తున్న ఈ పోస్ మిషన్లు

రేషన్ సరుకులు అందక లబ్ధిదారుల పడిగాపులు

ఎటపాక, ఫిబ్రవరి 7: ఈ నెల రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు గత ఐదు రోజులుగా నానా తంటాలు పడుతున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ పోస్ మిషన్ల ద్వారా పంపిణీ చేయాలని అధికారులు పేర్కొనడంతో ఎండీఎంలు, రేషన్ డీలర్లు గ్రామాల్లో ఈ పోస్ మిషన్ల ద్వారా లబ్ధిదారులు బయోమెట్రిక్ నమోదు చేసి, రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. అయితే ఈ పోస్ మిషన్లకు సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో అరకొరగానే బియ్యం పంపిణీ జరుగుతోంది. ఎటపాక మండలంలో 17 రేషన్ షాపులు ఆన్‌లైన్ విధానంలో పంపిణీ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. తొలుత ఎండీఎంలు, రేషన్‌డీలర్లు ఈ విధానంలో పంపిణీ చేయడం తమ వల్ల కాదని, అధికారులకు నివేదికలు పంపారు. అయితే ఆన్‌లైన్ విధానంలో పంపిణీ చేయాల్సిందేనని, అధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఎండీఎంలు బియ్యం పంపిణీ చేపట్టారు. అయితే ఈ పోస్ మిషన్లల్లో లబ్ధిదారులు బయోమెట్రిక్ నమోదుకు సిగ్నల్స్ అందక ఈ పోస్ మిషన్లు మొరాయిస్తున్నాయి. దాంతో గత మూడు రోజులు ఎటపాక మండలంలోని తోటపల్లి, సీతాపురం, టీపీవీడు, ఒడ్డుగుంపు, కుసుమనపల్లి, అయ్యవారిపేట, నెల్లిపాక, రేగడిగట్టు, ఎన్టీఆర్ కాలనీ తదితర గ్రామాల్లో 1800 కార్డుదారులకు కేవలం 80 మంది కార్డుదారులకే బియ్యం పంపిణీ జరిగింది. అలాగే కృష్ణవరం, కాపుగొంపల్లి, గన్నవరం గ్రామాల పరిధిలో 1000 మంది కార్డుదారులకు కేవలం 150 మంది కార్డుదారులకు బియ్యం పంపిణీ జరిగింది. గత ఐదు రోజులుగా లబ్ధిదారులు పనులు మానుకుని రేషన్ బియ్యం కోసం పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. మరికొన్ని గ్రామాల్లో ఈ పోస్ మిషన్లు మొరాయిస్తున్నాయి. మూడు రోజులుగా కూలీ పనులు మానుకుని బియ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి, రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'నిర్వాసితులను గోదావరిలో ముంచారు'

రంపచోడవరం మార్చి 9: పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా వారిని నడి గోదావరిలో ముంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. ఐటీడీఏ ఎదుట సీపీఎం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆదివాసీ జనరక్షణ దీక్షలో కిరణ్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన జిల్లాలో చేపట్టిన ఏజెన్సీ బంద్‌కు మద్దతుగా ఆదివాసీ జనరక్షణ దీక్ష చేపట్టామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లోతా రామారావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ దగా డీఎస్సీ అని, జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రం మొత్తం మీద 23 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారని అధికారంలోకి వచ్చాక కేవలం 6100 పోస్టులతో ఒక నోటిఫికేషన్ ఇచ్చారని ఇది ఎంతవరకు సమంజసమని అన్నారు. సీపీఎం నాయకులు పెయ్యల పాపారావు, పొత్తూరు రాంబాబు, పాండవుల సత్యనారాయణ, పొత్తూరు సత్యనారాయణ, వి.సత్యనారాయణ, బి.సింహాద్రి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

శంఖారావం కార్యక్రమాలను వేగవంతం చేయాలి

రంపచోడవరం మార్చి 9: రంపచోడవరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో శంఖారావం కార్యక్రమాలను వారం రోజుల్లో పూర్తి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి చెప్పారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు ప్రతి ఇంటికి వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసి తెలుగుదేశం ప్రభుత్వం వస్తే ప్రజలు పొందే లబ్ధిని వివరించాలన్నారు.

'రాష్ట్రంలో జగన్ దుకాణం మూసినట్టే..!'

రంపచోడవరం మార్చి9 : రాష్ట్రంలో జగన్ దుకాణం మూతపడినట్టేనని టీడీపీకి చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు రమేష్, వంతల రాజేశ్వరి అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు ఖరారైన నేపథ్యంలో శనివారం ఈ మేరకు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు వేర్వేరుగా మాట్లాడారు. ఈ పొత్తు రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ఈ పొత్తుతో జగన్ పాలనకు చరమ గీతం పాడినట్టేనని చెప్పారు.

'నీటి సరఫరా కొనసాగేలా చూడండి'



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

దేవీపట్నం,మార్చి9: గోకవరం మండలం కృష్ణునిపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులు తమ కాలనీకి నీటి సరఫరా ఆగకుండా చూడాలని దేవిపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, ఉపసర్పంచ్ గేదల అనంతలక్ష్మి, పోలిశెట్టి శివరామకృష్ణకు శనివారం వినతిపత్రం అందించారు. ఈనెల 10వ తేదీ నుంచి నీటి సరఫరా బాధ్యత నుంచి కాలనీ నిర్మాణ కాంట్రాక్టర్ తప్పుకుంటున్న విషయాన్ని కాలనీవాసులు పంచాయతీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పంచాయతీ కార్యవర్గం స్పందించింది. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి సరఫరా ఆగకుండా చూస్తామని హామీ ఇచ్చింది. అప్పటి వరకు నీటి సరఫరా ఆగకుండా విడుదల చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

మూలపాడులో టీడీపీ శంఖారావం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

దేవీపట్నం,మార్చి9: మూలపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శనివారం టీడీపీ శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు మచ్చు త్రిమూర్తులు, క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబూరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంచిపెట్టారు. జేఎస్ నగేష్, మచ్చు నాగేశ్వరరావు, సర్పంచ్ కుంజం రాజామణి, లంక పోసిబాబు, లంక హరిబాబు, జనసేన నాయకుడు కట్టుమూరి వీరబాబు, అయినవిల్లి భద్రం, కారం పోసమ్మ, తుర్సా కృష్ణ, పాతాళ పండు, మద్దేటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

'బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

రంపచోడవరం మార్చి 9: దేవీపట్నం మండలంలోని గుబ్బలెంపాలెం లో సుమారు రూ.2 కోట్ల 24 లక్షల భూ కుంభకోణంలో అప్పటి కలెక్టర్ కొందరు దళారులు, అలానే ప్రభుత్వ ఉద్యోగులు చేసిన తప్పులను వెలికి తీసి వారిని 65 రోజులు రిమాండ్‌కు పంపినప్పటికి, సంబంధిత వ్యక్తులపై నేటికి చార్జ్‌షీట్ వేయలేదని, ఇప్పటికైన చర్యలు చేపట్టాలని గుబ్బలెంపాలెం,చినరమణయ్యపేట గ్రామస్థులు శనివారంఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. దేవీపట్నంలో ఓ ఎస్ఐ కుంభకోణాలు చేసే దళారులకు కొమ్ముకాస్తు తమపై అక్రమ కేసులు పెడుతున్నారని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.

ప్రత్యేక ఉపవాస ప్రార్థన

కడియం, మార్చి 9: కడియం ఉన్నత పాఠశాల వెనుక షారోను దైవిక స్వస్థతశాలలో శనివారం ప్రత్యేక ఉపవాస ప్రార్థన జరిగింది. నిర్వాహకులు రెవ. డా. దేవరపల్లి రత్నరాజు మాట్లాడుతూ బైబిల్‌లో ఉన్న అనేక మంది భక్తుల విజయగాథలను వివరిస్తూ ప్రార్థనలు చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష పేడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సరోజిని రత్నరాజు, గొడవర్తి సుధ, గూడపాటి సీత, అన్నపూర్ణ, సత్యవతి, పందిరి రాజు, కొండేటి సునీల్, సురేష్, పాదూరి ప్రవీణ్, సన్నిధిస్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

గ్రీన్ హౌస్ డెవలప్‌మెంట్

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 9: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి డిగ్రీ మహిళా కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం గ్రీన్‌హౌస్ డెవలప్‌మెంట్ చేపట్టారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సాయి సునీత, ఇండస్ట్రియలిస్ట్ జి.మణి కుమార్ గ్రీన్‌హౌస్ డెవలప్‌మెంట్‌కు వివిధ రకాల మొక్కలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాఘవకుమారి మాట్లాడుతూ ప్రతి కళాశాలలో గ్రీన్‌హౌస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.ఎస్.రత్నకుమార్, డా.సిహెచ్ శ్రీనివాస్, ఎం.శ్రీదేవి, పి.శ్రీదేవి, టి.నాగమణి, బి.ఆశాలత, బోటనీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ-జనసేన ఎన్నికల శంఖారావ సభ

● రాజమహేంద్రవరంలో నిర్వహణ - ఏర్పాట్లు పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9: రాజమహేంద్రవరం మోరంపూడి సమీపంలోని జెమినీ మైదానంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు టీడీపీ-జనసేన ఎన్నికల శంఖారావం సభను నిర్వహిస్తున్నారు.ఈ మేరకు ఏర్పాట్లను టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ , టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్ కుమార్, వాసిరెడ్డి రాంబాబు , రాజమహేంద్రవరం పరిశీలకురాలు చిల్లా జగదీశ్వరి , టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు పరిశీలించారు.ఆదిరెడ్డి అప్పారావు, గన్నికృష్ణలు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో టీడీపీకి బలమైన న్యాయకత్వం ఉందన్నారు. నగరంలో అన్ని డివిజన్ల నుంచి వేలాదిగా సభకు తరలివస్తారని చెప్పారు. సీఎం జగన్ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి ఎలా నెట్టివేశారు.. అమలు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలు తదితర అంశాలను ప్రజలకు వివరిస్తారని చెప్పారు. ఈ ఎన్నికల శంఖారావాన్నివిజయవంతం చేయడానికి టీడీపీ శ్రేణులు చాలా ఉత్సాహంగా ఉన్నాయన్నారు. సభకు శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ మంత్రులు సుజయ కృష్ణరంగారావు, కెఎస్.జవహర్ హాజరవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, కోశాధికారి శెట్టి జగదీష్, కార్యనిర్వాహక కార్యదర్శులు మరుకుర్తి రవియాదవ్, మర్రి దుర్గాశ్రీనివాస్, కార్యదర్శి కిలపర్తి శ్రీను, మజ్జి రాంబాబు పాల్గొన్నారు.



ఎన్నికల శంఖారావం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి, గన్ని



చంద్రబాబు అనపర్తి పర్యటన ఏర్పాట్లపై సమావేశమైన ప్రతినిధులతో చర్చిస్తున్న నల్లమిల్లి

20న చంద్రబాబు అనపర్తి పర్యటన విజయవంతం చేయండి

అనపర్తి, మార్చి 9: ఈనెల 20న అనపర్తిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో శనివారం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గ సమన్వయ కమిటీ ప్రతినిధులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. అనపర్తిలో బహిరంగ సభ కోసం అనువైన ప్రదేశం ఎంపికపై కమిటీ చర్చించింది. సభకు టీడీపీ, జనసేన కార్యకర్తలతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే విధంగా నాయకులు కృషిచేయాలని రామ కృష్ణారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ అనపర్తి పర్యటన నేపథ్యంలో బహిరంగ సభకు అనువైన ప్రదేశం ఎంపిక కోసం ఐదారు చోట్ల స్థలాలను పరిశీలించాలని నిర్ణయించామని ఎంపికచేసే ప్రదేశంలో విద్యుత్, మంచినీటి సౌకర్యం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుంటున్నామన్నారు. నియోజకవర్గం లోని నాలుగు మండలాల ప్రజలు హాజరయ్యే విధంగా అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో అనపర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు, సమన్వయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనపర్తి టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన శంఖారావం డోర్ టు డోర్ బాట్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో నాయకులు మేనిఫెస్టో అంశాలను ప్రజలకు చేరువచేసే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాలకు చెందిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతోపాటు సమన్వయ కమిటీ సభ్యులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ళ గోవిందు, జుత్తుగ కృష్ణ, దత్తుడు శ్రీను. కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, చిర్రా వరప్రసాద్, రేలంగి నాగేశ్వరరావు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ కార్యక్రమం బాధ్యత బూత్ ఇన్‌చార్జ్‌లదే

రంగంపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటికీ తిరిగి నిర్వహించాలని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రంగంపేటలో టీడీపీ- జనసేన అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో టీడీపీ - జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బూత్‌కమిటీ సభ్యులు గ్రామనాయకులతో కలిసి కిట్‌లను పంపిణీ చేస్తూ సూపర్‌సిక్స్ ద్వారా పొందే లబ్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవింద్, మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, దేవానందబాబా, పూసల శ్రీను, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం.. రాష్ట్రాభివృద్ధి మా అజెండా

● భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి మా ప్రధాన అజెండా అని టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 45వ డివిజన్ అర్‌అండ్‌బీ కాలనీలో శనివారం టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు.

గోరంట్ల దిష్టి బొమ్మ దహనం హేయమైన చర్య

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 9: రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దిష్టి బొమ్మ దగ్ధం చేయడం హేయమైన చర్య అని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక వైసీపీ నాయకుల అరాచకాలను ఖండిస్తూ రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్యేటి శివసత్య ప్రసాద్ ఆధ్వర్యంలో బొమ్మూరు సెంటరులో బుచ్చయ్య చౌదరి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం శుక్రవారం దిష్టిబొమ్మ దహనం ప్రదేశాన్ని పాలతో కడిగి శుభ్రం చేశారు. కార్యక్రమంలో వెలుగుబంటి ప్రసాద్, మార్ని వాసుదువరావు, వెలుగుబంటి రఘురామ్, జల్లి కృపారావు, దండమూడి ప్రసాద్, బొప్పన శ్రీను, బీమరశెటట్టి రమేష్, కామిని భాస్కర్, ఆళ్ల ఆనందరావు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం 45వ డివిజన్‌లో భవిష్యత్‌కు గ్యారెంటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్



గోరంట్ల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మోదీ పాలనలో మహిళాభివృద్ధి శూన్యం : ప్రభావతి



మహిళా సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 9 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వపాలనలో మహిళలపై మానసిక, శారీరక దాడులు మరిన్ని పెరిగాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి విమర్శించారు. రాజమహేంద్రవరం విక్రమహాలులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మనువాద ప్రమాదం-మహిళల ముందున్న రాజకీయ కర్తవ్యం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. నేటికీ మహిళలపై వివక్ష కొనసాగుతున్నదని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మనువాద భావజాలం మరింత విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు అరుణ కుమారి, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, మహిళా సంఘం సీనియర్ నాయకురాలు టి.సావిత్రి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబీరాణి, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కె.వెంకటలక్ష్మి, మిడ్ డే మీల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బేబీ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఏ.జరీనా షరీఫ్, జిల్లా ఆఫీస్ బేరర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఇందిరమ్మ అభయం పథకంలో చేరండి

● లోగో ఆవిష్కరణలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ అభయం పథకం అమలు చేయడానికి మేనిఫెస్టోలో పెట్టినట్టు నగర కాంగ్రెస్ అధ్య క్షుడు బాలేపల్లి మురళీధర్ తెలిపారు. కృష్ణనగర్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన అత్యవసర సమావేశంలో ఇందిరమ్మ అభయం లోగో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో పేదరికంలో ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు రూ.5 వేలు చొప్పున ఇచ్చేందుకు ఈ పథకం ద్వారా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఈ పథకం యాప్‌ను వారి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసి పథకంలో చేరేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఇన్‌స్టాల్ చేసిన తర్వాత ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి సందేశం వినిపిస్తారన్నారు. అనంతరం మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మధుమణి, రాష్ట్ర కార్యదర్శిగా ఇజ్జరౌతు విజయలక్ష్మి, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలిగా చామర్తి లీలావతిని నియమించారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోతా శారద, బాలేపల్లి మురళీధర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ముళ్ళమాధవ్ నియామకపత్రాలను అందించారు. ఇటీవల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన బిల్డర్ బాబిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వడయార్, చింతాడ వెంకటేశ్వరరావు, కిషోర్ కుమార్ జైన్, దేవత సుధాకర్, సత్యనారాయణ , రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో అమలవుతున్నవి కేంద్ర పథకాలే : బీజేపీ

రాజమహేంద్రవరం రూరల్, మార్చి9: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పథకాలన్నీ కేంద్ర నిధులతోనే నడుస్తున్నాయని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ తెలిపారు. రూరల్ మండలం కోలమూరు పరిధిలో గల జంగాల కాలనీ ప్రాంతంలో రూరల్ బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రామచంద్రపురంలో ఎమ్మెల్యేగా ఉండి అక్కడ ప్రజలు ఛీ కొడతారనే ఆలోచనతో చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రూరల్‌కు వచ్చిన వలస నేత అని అన్నారు. కార్యక్రమంలో యనాపు ఏసు, తనుబుద్ది సూర్య భాస్కర్, పడాల హరీరామ్, బోడా సింగ్ రాజేష్, పల్నాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ధ్యేయంగా వైసీపీ పనిచేస్తుంది

రంగంపేట, మార్చి, 9 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాలే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పనిచేస్తుందని రంగంపేట మండలం జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. శనివారం రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ బాలమురళీ, కొల్లాటి ఇశ్రాయేలు, నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బిక్కవోలులో మహాన్నదానం

బిక్కవోలు, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని కేదారేశ్వరస్వామి ఆలయంవద్ద శనివారంరాత్రి మహాన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జంగా మురళీకృష్ణారెడ్డి, యామసాని రవి, వెంకటరెడ్డి, గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

హై స్పీడులోనూ ఫ్యాన్లు తిరగడంలేదు

● క్వారీమార్కెట్ ఏరియా ప్రజలకు కరెంట్ కష్టాలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 9 : రాజమహేంద్రవరం మల్లయ్యపేట సబ్‌స్టేషన్ పరిధి క్వారీ మార్కెట్ ఏరియాలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు కరెంట్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫ్యాన్లు హైస్పీడులో పెట్టినా పూర్తిస్థాయిలో తిరగడం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా ఉదయం, రాత్రి పూట ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. ఒక్కో సారి కరెంట్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. క్వారీ ప్రాంతాలైన ఆనందనగర్, రామదాసు పేట, సిద్ధార్థనగర్, పీఅండ్‌టీ కాలనీ, సుబ్బారావుపేట తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం, ఉక్కబోత ప్రారంభం కావడంతో ఇళ్లల్లో ప్రజలు ఫ్యాన్లు వేసుకోకుండా ఉండలేకపోతున్నారు. ఫ్యాన్లు స్పీడు తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకపోవడమే దీనికి ప్రధాన కారణంగా ప్రజలు భావిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరగడంతో ఆ భారాన్ని ట్రాన్స్‌కో అధికారులు ఇలా సర్దుబాటు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కరెంట్ సరఫరా ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఇంటర్మీడియట్ పరీక్షకు 23 మంది గైర్హాజరు

రంగంపేట, మార్చి, 9 : మండలంలోని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం లెక్కలు, జంతుశాస్త్రం, చరిత్ర పరీక్షలకు 480 మంది విద్యార్థులకుగాను 457 మంది హాజరయ్యారని, 23 మంది గైర్హాజరు అయ్యారని సీఎస్ బి.హేమ తెలిపారు. కె.వి.సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్‌లు డీవోలుగా విధులు నిర్వహించారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ జె.వి.వి.ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యం పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారని ఆమె తెలిపారు.

ఆరికరేవులలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

బిక్కవోలు, మార్చి 9: ఆరికరేవుల గ్రామంలో రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం కాపవరం, కొంకుదురు గ్రామాల్లో నవరత్న పథకాల్లో భాగంగా పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సత్తి వీరమణి, సత్యంశెట్టి వెంకటరమణ, మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ మహిళా పోలీసులకు సత్కారం



మహిళా పోలీసులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బందిని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు సత్కరించారు. మహిళలు ఇంట్లో కుటుంబాన్ని చూసుకుంటూ, వృత్తిపరంగా విధులు నిర్వర్తిస్తూ రెండు విధాలా అంకితభావంతో డ్యూటీ చేస్తారని ప్రశంసించారు. మహిళలకు ఎక్కడైతే సముచిత స్థానం గౌరవం దక్కుతుందో అక్కడ అభివృద్ధి, విజయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సీఐలు బాల మురళీ కృష్ణ, బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



కోరుకొండ, మార్చి9: కోరుకొండ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో చతుర్దశి సందర్భంగా శనివారం స్వామివారికి లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు స్వామివారికి నమక, చమకంలతో 11సార్లు ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. తదుపరి అన్నపూర్ణాదేవికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో పాటి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ జాజుల రాము, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు బోడెం శ్రీరాములు, మాజీ సర్పంచ్ తెలగంశెట్టి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కాలచర్ల నాగు, నాగా రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి విశ్వనాధ శర్మ, మర్ల వెంకట గంగాధర సీతారామశాస్త్రి, బాపిరాజు శర్మ, మిరియాల శేషు, పాల్గొన్నారు.

జంబుపట్నంలో జనసేన పాదయాత్ర

కోరుకొండ, మార్చి9: కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి జనసేన, టీడీపీ ఉమ్మడి కార్యాచరణ, ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలు వివరించారు.

చేనేత కుటుంబానికి సాయం అందజేత

కడియం, మార్చి 9: గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న వీరవరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అల్లక శ్రీనివాస్ కుటుంబాన్ని శనివారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పరామర్శించారు. శ్రీను తండ్రి చంద్రరావుకు రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, అన్నందేవుల కోదండరాముడు, దొంతంశెట్టి శ్రీనివాస్, గోరు నాగేశ్వరరావు, వాసు, కిషోర్, బాబి పాల్గొన్నారు.

అన్నవరం ట్రస్టు బోర్డు మెంబర్‌గా కటకం బాబ్జి

కోరుకొండ, మార్చి9: కోరుకొండ గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు కటకం బాబ్జి అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు దేవదాయ ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆయనకు ఎండోమెంట్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. అనంతరం ఆయన శనివారం అన్నవరం దేవస్థానంలో పాలకమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి కోరుకొండ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు, వైసీపీ నాయకులు నూతనంగా ట్రస్టుబోర్డు మెంబర్‌గా నియమితులైన కటకం బాబ్జిని అభినందించారు.

పేదలకు విద్యను అందించడం అభినందనీయం

గోకవరం, మార్చి9: పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం అభినందనీయమని స్థానిక ఎస్ఐ కె.నాగరాజు, టీడీపీ నాయకుడు దాసరి తమ్మన్న దొర అన్నారు. గోకవరంలో రాజా పబ్లిక్ స్కూల్ 44వ వార్షికోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాభివృద్ధి కోసం రాజా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అందిస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థుల ఆటల పోటీలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. గ్రామ పెద్దలు, రాజకీయ నాయకులు పాఠశాల యాజమాన్యం అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ పి.రమానాగలక్ష్మి, కరస్పాండెంట్ పి.సూర్యప్రకాశరావు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ సూర్యప్రకాశరావు

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: భీమా
సూర్యామినీ	: సైతాన్
సూర్యాప్యాలస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: భీమా
శివజ్యోతి	: భీమా
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమలు
రాజా	: భీమా
ఊర్వశి	: హనుమాన్
రంభ	: రికార్డు బ్రేక్
మేనక	: బాబు నెం.1, బుల్ షిట్..
అప్సర	: గామి
కుమారి	: గామి
వీఎస్ మహోల్(నామవరం)	: భీమా
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: గామి
వెంకటసూర్య(కడియం)	: భీమా
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: గామి
రామకృష్ణ(కోరుకొండ)	: భీమా
గీతాసినిమాస్ (సీతానగరం)	: భీమా
శ్రీనివాస (గోకవరం)	: భీమా
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఊరుపేరు భైరవకోన
లలితామహోల్(రంపచోడవరం)	: భీమా
నవయుగ(చింతూరు)	: భీమా







కలిసిన కమలం

ఇక వైసీపీకి మూడింది!

- టీడీపీ-జనసేన..బీజేపీ పొత్తు
- కేడర్‌లో జోష్‌..వైసీపీకి వెన్నులో వణుకు
- రాజమహేంద్రవరం లోక్‌సభ బీజేపీకే
- పురందేశ్వరి పోటీ చేసే అవకాశం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన- బీజేపీ పొత్తు ఖరారైంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది.ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు తమ పార్టీ ముఖ్యనేతలకు పొత్తు ఖరారైనట్లు స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే.రాష్ట్ర వ్యాప్తంగా ఆరు అసెంబ్లీ, ఐదు పార్లమెంట్‌ స్థానాలు బీజేపీకి ఇస్తున్నట్టు ప్రకటించారు. బీజేపీ కోరిన స్థానాల్లో రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం కూడా ఉన్న సంగతి తెలిసిందే. మూడు పార్టీల పొత్తుతో జిల్లాలో జోష్‌ పెరిగింది.అధికార వైసీపీలో మరింత వణుకు మొదలైంది.ఇప్పటికే ప్రజావ్యతిరేకత, వైసీపీలోనే అసమ్మతి, ఒకరి మధ్య ఒకరికి మాట కుదరక పోవడం, అభ్యర్థుల మార్పులు వంటి వాటితో సతమతమవుతున్న వైసీపీకి టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు మరింత వణుకు పుట్టిస్తోంది.టీడీపీ - జనసేన పొత్తుతోనే వైసీపీ అధిష్ఠానానికి ఏం చేయాలో తోచడంలేదు.గెలుస్తామో లేదోననే ఆందోళనలో ఉన్నారు. దీనిలో భాగంగానే ముందస్తుగానే ఓటర్లకు వల వేస్తున్నారు. షెడ్యూల్‌ రాక ముందే తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే ఖర్చుకు అభ్యర్థులు గిజగిలాడిపోతున్నారు.పోలింగ్‌ సమయంలో ఎంత పంచాలోనని మదనపడుతున్నారు. కానీ ఇప్పటికే బలంగా తయారైన ప్రతిపక్ష టీడీపీ-జనసేనతో బీజేపీ కలవడంతో వైసీపీకి అహసనం పెరిగింది.రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పోటీ చేసే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు టికెట్‌ కోసం ప్రయత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ నుంచి బీజేపీ అభ్యర్థి గెలిచిన సందర్భాలు ఉన్నాయి. టీడీపీ ఏర్పడిన తర్వాత 1984 నుంచి 2019 వరకూ జరిగిన పది లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ మూడు సార్లు, బీజేపీ రెండు సార్లు, కాంగ్రెస్‌ నాలుగు సార్లు, వైసీపీ ఒకసారి గెలిచింది. 1998లో వాజ్‌పేయి హవాలో బీజేపీ తొలిసారిగా ఇక్కడ ఒంటరిగా పోటీ చేసి గెలిచింది.అప్పుడు టీడీపీ అభ్యర్థి ఎంవీవీఎస్‌ మూర్తి మీద 9,912 ఓటర్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి గెలిచారు. మళ్లీ 1999లో ఎన్నికలు వచ్చేశాయి.అపుడు బీజేపీ అభ్యర్థి ఎస్‌బీపీబీకె సత్యనారాయణరావు కాంగ్రెస్‌ అభ్యర్థి చిట్టూరి రవీంద్రపై 60,031 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అపుడు టీడీపీ,బీజేపీ పొత్తు ఉంది. కానీ 2004లో బీజేపీ అభ్యర్థిగా కంటిపూడి సర్వారాయుడు పోటీ చేశారు. ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు ఇండిపెండెంట్‌గా పోటీ చేయడంతో బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్‌ అభ్యర్థి ఉండవల్లి అరుణకుమార్‌ చేతిలో ఓడిపోయారు. 2014లో టీడీపీ-బీజేపీ పొత్తుతో సిటీలో ఎమ్మెల్యేగా ఆకుల సత్యనారాయణ గెలిచారు. 2019లో పొత్తులేదు. మళ్లీ ఇవాళ పొత్తు ఉండడంతో వారి బలం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ కేడర్‌తో పాటు వారికి మద్దతు ఇస్తున్న టీడీపీ జనసేన కేడర్‌లోనూ జోష్‌ పెరిగింది. వైసీపీ ప్రభుత్వ వైఖరి వల్ల విసిగిపోయిన ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కానీ టీడీపీ నుంచి టికెట్‌ ఆశించిన నేతలకు కాస్త ఇబ్బంది అయినా, పొత్తు ధర్మం వల్ల వారు కూడా సంతోషాన్నే వ్యక్తం చేస్తున్నారు.

మునిసిపల్‌ డైమండ్‌ జూబ్లీ వేడుకలు మీరెలా చేస్తారు..

నిడదవోలులో ప్రజా సంఘాల నిరసన 8



ప్రలోభాలతో.. సిద్ధం!

ఎన్నికల వేళ..తాయిలాలతో వల

జగన్‌ సిద్ధం.. సిద్ధం అంటుంటే ఓటర్లు ఎందుకో అనుకున్నారు.. ఇంతకీ తాయిలాలకు అని తెలియదు.. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్‌ రాకుండానే వైసీపీ నాయకులు తాయిలాలతో రోడ్డెక్కుతున్నారు.. మాకే ఓటేయండి అంటూ ఇంటింటికి తిరుగుతూ చీరలు పంపిణీ చేస్తున్నారు.. రాజమహేంద్రవరం నారాయణపురం వాంబే కాలనీలో శనివారం చీరలు పంపిణీ చేశారు. ఇవెక్కడ నుంచి వచ్చాయంటే మాత్రం.. వైసీపీ అధిష్ఠానమే పంపినట్టు చెబుతున్నారు.. ఇంతకీ తాయిలాలు ఇవ్వడానికి సిద్ధమా అని తెలిసి ఓటర్లు నివ్వెరపోతున్నారు...

- అదే పనిగా ప్రలోభాల పర్వం
- నాలుగేళ్లుగా లేని కపట ప్రేమ
- ఓట్ల 'పండుగ' వేళ 'చీర'ల రూపంలో
- బహిరంగంగా..దర్జాగా పంపిణీ
- ఎంపీ బొమ్మతో ప్రచారం
- ఓటుంటేనే చీర అందజేత
- పెద్ద సంఖ్యలో పేద వార్డులపై కన్ను
- ఓటరు, ఆధార్‌ కార్డు ప్రామాణికం
- వైసీపీ కుర్రాళ్ల మోహరింపు

రాజమహేంద్రవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జగన్‌ బటన్‌ మాటున ఐదేళ్ల పెట్టిన తిప్పలు జనాలు గ్రహించేశారని అనుకున్నారో.. ఓటర్ల 'గాలి' మళ్లిందనే విషయం బోధపడిందో..ప్రచారం కోసం అమలు చేస్తున్న 'పథకాలు' పారలేదని తేలిపోయిందోగానీ వైసీపీ నాయకులు మాత్రం ప్రలోభాల పంపిణీనే నమ్ముకున్నట్లుగా పరిస్థితులు కానవస్తున్నాయి. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదల కాకుండానే చీరలు,ప్యాంట్లు, షర్టులు తెచ్చి మహిళల చేతిలో పెట్టేస్తున్నారు. అసలు ఇంత భారీ సంఖ్యలో పంచిపెడుతున్నారంటే అవన్నీ ఎప్పుడు కొనుగోలు చేశారనే విషయంపై చర్చ నడుస్తోంది. ప్లాను పని అయిపోందంటూ



కొవ్వూరులో వలంటీర్లను సన్మానించి చీరను అందజేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అనపర్తిలో పన్నుల ముసుగు

అనపర్తి, మార్చి 9 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీ నాయకులు బరి తెగిస్తున్నారు. తాయిలాలతో వల వేస్తున్నారు. అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలో శుక్రవారం వలంటీర్లకు సత్కారాలు చేసి బహుమతులు అంద జేయడం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో నూరు శాతం ఇంటి పన్నులను 14 రోజుల్లో వంద శాతం వసూలు చేయడంతో వలంటీర్లను ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా సత్కరించామని పంచాయతీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇదంతా మూడు నెలల కిందటే జరగ్గా నేడో రేపో నోటిఫికేషన్‌ వస్తున్న తరుణంలో సత్కారాలు చేయడం బహుమతులు అందించడం ప్రలోభాల కిందకు వస్తుందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు.



పంచడానికా సిద్ధం : రాజమహేంద్రవరం నారాయణపురం వాంబే కాలనీలో వైసీపీ నాయకులు పంపిణీ చేసిన చీర చూసుకుంటున్న మహిళలు

సర్వేలు గత కొద్ది నెలలుగా ఘోషిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రలోభాల కోసం బహుమతులను ముందుగానే 'సిద్ధం' చేసుకున్నారని తెలుస్తోంది.నాలుగేళ్లుగా పండుగల వేళ కూడా అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు గుర్తుకురాలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాత్రం 'చీరల రూపంలోని తాయిలాలతో మహిళలపై వైసీపీ నాయకులకు కపట ప్రేమ ఉప్పొంగిపోతోంది. జిల్లా అంతటా ఎక్కడ చూసినా చీరల పంపిణీ జోరుగా సాగుతోంది. మరికొన్ని చోట్ల కుక్కర్లు, సీలింగ్‌ ఫ్యాన్లు,డిన్నర్‌ సెట్లు ముట్టజెప్పి ఓటును దండుకుంటున్నారు.మంత్రి వేణు ఏకంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సమాచార శాఖ వాహనంలోనే ప్రలోభాల బహుమతులను తరలించి అధికార దుర్వినియోగానికి పాల్పడడం చూసి బరితెగింపు కూడా నివ్వెరపోయిందట.

ఇన్నేళ్లుగా ఏమైపోయింది!

వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు 'ఓ సారి చూద్దామని' కట్టబెట్టిన అధికారానికి దాదాపు మరో రెండు నెలల్లో ఆయుష్షు తీరుతుంది.ఈ ఐదేళ్లలో అక్కాచెల్లెమ్మల ఇంటికి వెళ్లి కష్టసుఖాలు తెలుసుకున్న వైసీపీ నాయకుడు లేడు. ఆ పార్టీ అధినేత మరీ దారుణం. ఎక్కడో ఓ చోట సభ పెట్టడం.. భద్రతా వలయంలో వచ్చి బటన్‌ నొక్కి నాలుగు కల్లబొల్లి కబుర్లు వల్లెవేసి జారుకోవడం అందరికీ సుపరిచితమే. అంగన్వాడీలు, ఆశాలు, టీచర్లను రోడ్డెక్కించి మరీ ఆయన పెట్టిన ముప్పుతిప్పలు అన్నీఇన్నీకావు. వైసీపీ నాయకులు కూడా అదే మార్గాన్ని అనుసరించారు. తమకు 'లాభం' చేకూరే పనుల్లో ఈ ఐదేళ్లూ బిజీ అయిపోయారు. వార్డుల్లో తిరిగిన పాపాన పోలేదు. గ్రామాల్లోని మహిళలు చిన్న ధ్రువపత్రానికి కూడా నానా కష్టాలూ పడ్డారు. ప్రతి పనికీ ఓ రేటు పెట్టి మరీ దండుకున్నారు. వైసీపీ నాయకులకు ముడుపులు ముట్టజెప్పిన తర్వాత అధికారులకు ఫోను వెళితేనే సంతకం చేసేవాళ్లు. ఈ ఐదేళ్లలో ఎన్నో పండుగలు వచ్చాయి. కానీ ఎప్పుడూ వైసీపీ నాయకులు ఊరు ఊరంతా చీరలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఎన్నికల వేళ మాత్రం పండుగలకూ ప్రలోభాలను పులిమేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా పండుగల పేరు చెప్పి మహిళలకు చీరలు పంచిపెడుతున్నారు. ఒక్కో ఏరియాలో ఒక్కో సమయంలో చీరల పంపిణీ జరుగుతోంది. ముందు రోజున అయా ప్రాంతాల్లోని చోటామోటా నాయకులు వీధుల్లో తిరిగి రేపు చీరలిస్తామని చెబుతున్నారు. ఆ మేరకు సన్నద్ధం చేసి.. మరుసటి రోజున చీరలను చేతిలో పెడుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఇప్పుడు ఈ తంతు నిర్విరామంగా నడుస్తోంది. ఇదంతా ఎన్నికల స్టంటు అని సామాన్య ప్రజానీకం ఇప్పటికే గ్రహించారు. దీంతో కొందరు మహిళలు చీరలు తదితర బహుమతులను తిరస్కరిస్తున్నట్లు సమాచారం.

కార్డులు చూసి..బరి తెగింపు..

కొద్ది రోజుల నుంచి వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, ఆశాలు, అంగన్వాడీ వర్కర్లకు తాయిలాల పంపిణీ జరిగింది. నయానో, భయానో వారిని ముందుగా సన్నద్ధం చేశారు. ఇప్పుడు వీధుల్లో పంపిణీ మొదలైంది. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో కొన్ని వార్డుల చొప్పున ప్రతి రోజూ చీర తాయిలం ఇళ్లకు ఇస్తున్నారు. శనివారం ఒకటి నుంచి పది వార్డులను నిర్దేశించుకున్నారు. దీనిలో భాగంగా ఆయా ప్రాంతాలకు ఆటోల్లో చీరల బేళ్లను తరలించారు. వాటిని సిట్టింగ్‌ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ బొమ్మ ఉన్న బాక్సుల్లో పెట్టి,దానిని ఆయన చిత్రాలు ఉన్న కవర్లలో ఉంచి ఇస్తున్నారు. ఈ పంపిణీకి ప్రభుత్వ యంత్రాంగాన్ని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. అయా వార్డుల్లోని స్థానిక యువత వెంట సచివాలయ సిబ్బంది, వలంటీరు వెళుతున్నారు. ఓటరు లిస్టులో పేరు వెరిఫై చేసిన తర్వాత సదరు మహిళ ఓటరు కార్డు, ఆధార్‌ కార్డు చూస్తున్నారు.ఆ వివరాలను ఓటరు లిస్టుతో సరిపోల్చుకొని చీరను చేతిలో పెడుతున్నారు. ఈ ప్రలోభాల పంపిణీకి కొన్ని పేదలు, మధ్యతరగతి జీవులు ఉండే ప్రాంతాలను ఎంచుకొన్నారు. ధనికులు ఉండే ప్రాంతాల్లో బాగా గుట్టుగా వ్యవహారం నడుస్తోంది. ఎక్కడైనా ఈ ప్రలోభాల పంపిణీని ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు అడ్డుకుంటారనే భయంతో.. మీడి యా వల్ల ప్రజలకు అసలు నిజం తెలిసిపోతుందనే ఆందోళనతో కొందరు కుర్రాళ్లతో ఈ తంతు నడిపిస్తున్నారు. ఎవరైనా అడ్డుపడితే చితక్కొట్టండనే మౌఖిక ఆదేశాలు ఆయా నేతల నుంచి ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో చీరల పంపిణీ ప్రదేశంలో వైసీపీ కుర్రాళ్లు మోహరిస్తున్నారు. ఎవరైనా కొత్తవాళ్లు వెళ్తే వారు ఎవరని ఆరా తీస్తున్నారు. ఫొటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నిస్తే రెచ్చిపోతున్నారు.

తర్వాత సుద్ధపూసలమంటూ..

ఎన్నికల నోటిఫికేషన్‌ బాగా దగ్గరకు వచ్చేసింది. ఏ క్షణంలోనైనా ఏపీలో ఎన్నికల పోరుపై ఎన్నికల సంఘం ప్రకటన చేసే అవకాశం ఉంది. ఒకసారి నోటిఫికేషన్‌ వెలువడిన తర్వాత ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేస్తుంది. ఎన్నికల సంఘం పరిశీలకులు రంగంలోకి దిగుతారు. ఎన్నికలకు అభ్యర్థులు చేస్తున్న ఖర్చులను లెక్కలు వేస్తారు. వారి ఎన్నికల వ్యయ జాబితాలో చేరుస్తారు. బిల్లులు, రవాణా అనుమతులు, ఉద్దేశం వంటివీ పక్కాగా ఉండాలి. అందువల్ల నోటిఫికేషన్‌ రాకకు ముందే ఏదోక పర్వదినం పేరుజెప్పి ప్రలోభాల పంపకానికి వైసీపీ నాయకులు తెరతీశారు. ముందస్తు ప్రణాళికలో భాగంగా వైసీపీ షాడో అధినేత మాదిరిగా వ్యవహరిస్తున్న 'ఐప్యాక్‌' చెప్పిన విధంగా 'పంపిణీ'లు జరుగుతున్నాయి. కొద్ది నెలల నుంచే కొనుగోలు, రవాణా, ఆయా ప్రాంతాలకు చేర్చడం వంటి పనులు చేపట్టారు. వాటిని ఎన్నికల నోటిఫికేషన్‌కి ముందే 'సర్దేయాలని' ఆదేశించారని తెలుస్తోంది. దీంతో ముందుగా మీడియా, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీలు, ఆశాలు, వలంటీర్లను పంపిణీ చేసి తర్వాత ఇప్పుడు వీధికెక్కారు.

ఎంపీగారు మాకో!

పార్లమెంట్‌ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే వారిని ఎంపీ అంటారని తెలిసిందే. కానీ రాజమహేంద్రవరం పార్లమెంట్‌ నియోజకవర్గానికి మాత్రం అనధికార ఎమ్మెల్యే ఉన్నట్టుగా వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ పరిస్థితి ఉంది.ఈ పార్లమెంట్‌ సెగ్మెంట్‌లోకి రాజమహేంద్రవరం సిటీ, రూరల్‌, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు,నిడదవోలు, గోపాలపురం శాసన సభ నియోజకవర్గాలు వస్తాయి. అయితే ముందు నుంచీ ఎంపీ భరత్‌ రామ్‌ రాజమహేంద్రవరం సిటీపైనే కర్చీఫ్‌ వేసి కూర్చు న్నారు.మిగతా నియోజకవర్గాలను పెద్దగా పట్టించుకో లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పుడు చీరల పంపిణీ విషయంలోనూ అదే జరుగుతోంది.దీంతో గత ఎన్నికలతో తమతో అవసరం తీరిపోయిందంటూ ఆరు నియోజకవర్గాల అక్క చెల్లెమ్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గాలి చీరల వలలో పడొద్దంటూ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ నారీమణులకు సలహా ఇస్తున్నారు. వాస్తవానికి ఈ ఐదేళ్లలో పార్లమెంటు సెగ్మెంటులోని ఏడు నియోజకవర్గాల్లో ఏ ఒక్క నియోజకవర్గంలో మహిళలకు కూడా ఏ పర్వదినాలకూ ఇంత పెద్ద మొత్తంలో ఎంపీ భరత్‌రామ్‌ చీరలు పంపిణీ చేసిన సందర్భాలు లేవు.అయితే రాజమహేంద్రవరం సిటీ నుంచి అసెంబ్లీ అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీలో ఉండాలని భరత్‌ కోరుకుంటున్నారు. అందువల్ల సిటీలో మహిళలకు చీరలవల విసురుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

ఓటమి భయంతోనే చీరల పంపిణీ

రెడ్డి మణేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు



రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ రామ్‌ రానున్న ఎన్నికల్లో ఓటమి చెందుతామనే భయం పట్టుకుంది. అందుకే ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రారంభించాడు. నగరంలో అన్నిడివిజన్లలో మహిళా ఓటర్లకు చీరలు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నాడు. అతను నగరంలో చేసిన అభివృద్ధి నిజమే అయితే మహిళలకు చీరలు పంచిపెట్టాల్సిన అవసరం ఏముంది. ఇటువంటి విధానాలు హర్షించదగ్గవి కాదు. ప్రజలే తగిన బుద్ధిచెబుతారు.

హోం మంత్రి వనిత విందు..

దేవరపల్లి, మార్చి 9 : వైసీపీ నాయకులు ఏ వర్గాన్ని వదలడం లేదు. మీడియాను తమ గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల వేళ హోం మంత్రి తానేటి వనిత గోపా లపురం యర్నగూడెంలోని కల్యాణమండపంలో శని వారం సాయంత్రం నియోజకవర్గంలోని ప్రింట్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ మీడియా సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆహా అనిపించేలా విందు ఏర్పాటు చేశారు. విలేకరులందరినీ పేరు పేరునా పరిచయం చేసుకున్నారు. అనంతరం కుక్కర్‌, చీర, షర్టు ప్యాంట్‌ ఇచ్చారు. మీరంతా సహకరించాలని కోరారు.



కణుపూరుకొండపై పంచముఖ మల్లికార్జున స్వామి

కణువూరు తీర్థం ప్రారంభం

5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహణ

కోరుకొండ, మార్చి 9 : కోరుకొండ మండలం కణుపూరు తీర్థం శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కణుపూరు కొండపై స్వయంభుగా వెలిసిన పంచముఖ మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు చేశారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి 64వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొండపైన కొండ దిగువన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.శనివారం స్వామి వారిని జనసేన, టీడీపీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, బత్తుల వెంకటలక్ష్మి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కొండపైన, కొండ దిగువున స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం కొండ దిగువున 5రోజులు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జగన్‌ మాయ ఇదేనా సంక్షేమం



ప్రభుత్వ హాస్టల్‌ విద్యార్థులకు టెన్షన్‌ తప్పదా?

- మరో 10 రోజుల్లో పది పరీక్షలు
- ఈ ఏడాది 200 మంది హాజరు
- ట్యూటర్లు ఉన్నట్టా ? లేనట్టా ?
- ముందుకు సాగని చదువు
- నేటికీ అందని పౌష్టికాహారంలేదు..
- టెన్త్‌ నూరుశాతం గట్టెక్కడం దైవాధీనం ?
- ఆందోళనలో తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం అర్బన్‌, మార్చి 9 : ప్రభుత్వ తీరుతో విద్యార్థులకు ఒత్తిడి తప్పడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పదవ తరగతి విద్యార్థులు ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించేవారు. దాతల సహకా రంతో పౌష్టికాహారం అందజేసేవారు. మరి నేడు పౌష్టికాహారం లేదు.. చదువుల ఊసే లేదు. ప్రతి విద్యార్థి కెరీర్‌లో 10వ తరగతి అత్యంత కీలకమైనదనే చెప్పాలి. టెన్త్‌లో సంపాదించుకునే మార్కులు భావి జీవితంలో వారిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి మెట్టుగా ఉపయోగపడతాయి. ఇంటర్‌లో ప్రవేశాలు మొదలుకుని ఉద్యోగాల వేటలో వారికి ఊతకర్రగా నిలుస్తాయి. అలాంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన టెన్త్‌ చదువుల విషయంలో ఎస్సీ హాస్టళ్లలోని విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందనే చెప్పాలి.

18 నుంచే పరీక్షలు

ఈ నెల 18వ తేదీ నుంచి టెన్త్‌ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. పరీక్షలకు హాజరవుతున్న టెన్త్‌ విద్యార్థులకు హాస్టళ్లలో ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు, ఏర్పాట్లు లేవు. పౌష్టికాహారం ఊసేలేదు. సాధారణ మెనూతోనే సరిపెడుతున్నారు. నలుగురితో పాటు .. అన్న చందంగా హాస్టళ్లలో ఉంటూ పబ్లిక్‌ పరీక్షలకు ప్రిపేర్‌ అవుతున్నారు. పాఠాలను పునశ్చరణ చేయడానికి, ఏమైనా సందేహాలు వస్తే తిరిగి బోధించడానికి సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పూర్తిస్థాయిలో ట్యూటర్లను ఏర్పాటు చేయలేదు. మోటివేషన్‌ క్యాంపులు నిర్వహించకపోవడం, ఇతర అభ్యసన ప్రక్రియలు చేపట్టకపోవడం ఎస్సీ హాస్టళ్లలోని టెన్త్‌ విద్యార్థులకు శాపంగా మారుతోంది. తాము చదివే స్కూళ్లలో మాస్టార్లు చెప్పే పాఠాలు విని రావడం తప్ప హాస్టళ్లలో ప్రత్యేక బోధనా తరగతులు లేవనే చెప్పాలి. దీంతో తమ పిల్లలు పబ్లిక్‌ పరీక్షలు ఎలా రాస్తారో అనే బెంగ విద్యార్థుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో గతేడాది 162 మంది టెన్త్‌ పరీక్షలకు హాజరైతే 128 మంది మాత్రమే పాసయ్యారు. 34 మంది పరీక్షలు తప్పారు. కనీసం పాస్‌ మార్కులతో కూడా విద్యార్థులు పాస్‌ కాలేదంటే సాంఘిక సంక్షేమశాఖ అధికారుల పర్యవేక్షణ, వారిపై శ్రద్ధ ఏపాటివో అర్థం చేసుకోవచ్చు.ఈ ఏడాది టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు దైవాధీనం అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది 200 మంది పైగా..

కొద్దిరోజుల్లో జరగబోయే టెన్త్‌ పబ్లిక్‌ పరీక్షలకు జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల నుంచి 200 మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో ఎంతమంది పాస్‌ అవుతారనేది చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే గతేడాది ఫలితాలను చూస్తే ఈ ఏడాది ఏం జరుగుతుందో ఇట్టే అర్థం అవుతుందని చెబుతున్నారు. ఈ ఏడాది కూడా టెన్త్‌ విద్యార్థుల పట్ల సాంఘిక సంక్షేమ అధికారులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ, కార్యాచరణ కనిపించడం లేదనే చెబుతున్నారు. లెక్కలు, ఇంగ్లీషు, సైన్స్‌ హిందీ సబ్జెక్టులకు ట్యూటర్లను పెట్టామని సాంఘిక సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నా ఎంత మందిని ఏయే హాస్టళ్లలో పెట్టారనేదానిపై సమాచారం లేదు.చాలా హాస్టళ్లలో ట్యూటర్లు లేరని సమాచారం.దీంతో స్కూళ్ల నుంచి సాయంత్రం హాస్టల్‌కు వచ్చిన టెన్త్‌ విద్యార్థులు పుస్తకాలు చూసి చదువుకోవడం మినహా మరో గత్యంతరం లేకుండా ఉంది.ఈ పరిస్థితుల్లో టెన్త్‌ విద్యార్థుల నూరుశాతం ఉత్తీర్ణత పై ఈ ఏడాదీ నిరాశ తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మహిళలకు ఆరోగ్యానివ్వండి..

మహిళా వైద్యులకు కలెక్టర్‌ మాధవీలత సూచన

రాజమహేంద్రవరం అర్బన్‌, మార్చి 9 : స్త్రీ శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం అవ్వడమే మహిళాసాధికారితకు నిజమైన నిదర్శనం అని కలెక్టర్‌ కె.మాధవీలత అన్నారు. రాజమహేంద్రవరం వై.జంక్షన్‌ వద్ద ఐఎంఏ మహిళా విభాగం వైద్యులు ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని కలెక్టర్‌ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. భారతదేశంలో ఇతిహాస, పురాణ కాలం నుంచి మహిళలకు సముచితస్థానం లభిస్తున్నదన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళా వైద్యులు స్త్రీలకు ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల వారిలో అవగాహన కలుగజేసే కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. ఈ ర్యాలీలో వైద్యులు డాక్టర్‌ అరుణకుమారి, డాక్టర్‌ పద్మజ, డాక్టర్‌ ప్రేమలత, డాక్టర్‌ కాంతితేజ, డాక్టర్‌ రాధిక, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్‌ గురుప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

శివోహం



శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ పలువురు భక్తులు జాగారం చేశారు. దీంతో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. దీనిలో భాగంగా నిడదవోలు పంచాయతన క్షేత్రం సోమేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం ఆకట్టుకుంది. -8

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

మంచు శివలింగానికి విశేష పూజలు

నిడదవోలు, మార్చి 9: నిడదవోలు పట్ట ణంలోని బాలా త్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామివారి పంచాయతన క్షేత్రం లో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అర్ధరాత్రి లింగోద్భవ కా లంలో ఏర్పాటుచేసిన మంచు శివలింగా నికి భక్తులు విశేష పూజలు నిర్వహించా రు. శివనామస్మరణతో లింగోద్భవ సమ యం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి సహ య అర్చకుడు అభిరామ్ శాస్త్రిలు విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసినజాగరణ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

లింగోద్భవ కాలంలో జ్యోతి దర్శనం



తాళ్ళపూడి, మార్చి 9: మహాశివరాత్రి పర్వదినం సంద ర్భంగా శనివారం తాళ్ళపూడిలోని పుష్కర్‌ఘాట్ వద్దగల గౌతమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన లింగోద్భావ జ్యోతి దర్శనం భక్తులను పరవశింపచేసింది. 25 అడుగుల ఎత్తుకలిగిన స్థంభానికి నూనె దారాలతో ఏర్పాటు చేసిన జ్యోతికాంతులను భక్తులు పరవశంతో శివనామస్మర ణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. గత 6 సంవత్సరాలుగా జ్యోతిని ఏర్పాటుచేస్తున్నామని ఆలయకమిటీ సభ్యు లు కవల శ్రీనివాస్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన హిం దూ ధర్మ ప్రచారపరిషత్ ఉపన్యాసకులు పరస రాధాకృష్ణ శివరాత్రి పూజలు జరిపించి లింగోద్భావ జ్యోతి విశిష్ఠను వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేకపల్లి వీరాస్వామి, డివి సత్యన్నారాయణ, బోసికొండ వెంకటస్వామి, శింగం శివ, భక్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా స్వామివారి రథోత్సవం



నల్లజర్ల, మార్చి 9: మండలంలోని అనంత పల్లిలో వేగిలింగేశ్వర స్వామి రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం పురష్కరించుకని రథోత్సవం వైభవంగా నిర్వహించారు. హర.. హర వేగిలింగేశ్వరా అంటూ భక్తులు భక్తీపారవశ్యంతో పులకింతులయ్యారు. విద్యుత్ దీపాలు,పూలతో అలంకరించిన ప్రత్యేక రథంపై స్వామి, అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో ఊ రేగించారు. ఆలయ ఈవో లక్ష్మీశర ణ్య, ట్రస్టుబోర్డు చైర్మన్ చిక్కాల నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ప్రత్తి మురళీకృష్ణ పాల్గొన్నారు.

హలో దివ్యాంగ ఛలో అమరావతి

● నిడదవోలు నుంచి తరలివెళ్లిన దివ్యాంగులు



నిడదవోలు నుంచి దివ్యాంగ మహాగర్జనకు తరలి వెళ్లిన దివ్యాంగులు

నిడదవోలు, మార్చి 9: నిడదవోలు పట్టణం నుంచి వీహెచ్‌పీఎస్, జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అమరావతిలో జరుగుతున్న హలో దివ్యాంగ ఛలో అమ రావతి కార్యక్రమానికి దివ్యాంగులు తరలివెళ్లారు. దివ్యాంగులు తమ హక్కుల సాధనకోసం మందకృష్ణ మాదిగ నిర్వహిస్తున్న మహాగర్జనకు తరలివెళుతున్నామని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు భీమడోలు కిరణ్‌కుమార్, ర్యాలి శివ తెలిపారు.

గురుకుల విద్యార్థులకు పెన్నులు అందజేత



పెన్నులతో గురుకుల పాఠశాల విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 9 : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమించినట్లయితే విజయం సాధించవచ్చునని జోడాలవెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు మండలం కుమారదేవంలో గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సుజాత ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. జోడాల వెంకటేశ్వరరావు, రమాదేవిలు పాల్గొని విద్యార్థులను ఉత్సా హపరుస్తూ వారిలో స్ఫూర్తిని నింపారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం, పెన్నులు బహూకరించారు. ప్రిన్సిపాల్ సుజాత జోడాల దంపతులను సన్మానించారు.

పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

కొవ్వూరు, మార్చి 9 : పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని హోలి ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంటు వలీయవీడు నెల్సన్ ఆంటోని అన్నారు. శనివారం పాఠశాల 22వ వార్షికోత్సవం తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యా సంవత్సరంలో ఒక్కరోజు కూడా సెలవు పెట్ట కుండా పాఠశాలకు హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కరస్పాండెంటు నెల్సన్ ఆంటోని, డైరెక్టర్ జెస్సీ నెల్సన్‌లు సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

బీసీలకు అధిక సీట్లు ఇచ్చిన వారినే గెలిపించాలి

● బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య



చాగల్లులో బీసీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య

చాగల్లు, మార్చి 9 : బీసీలకు చట్టసభల్లో అధిక సీట్లు కేటాయించిన పార్టీకే మనం ఓట్లువేసి గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం చాగల్లులో జరిగిన బీసీ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. బీసీలకు రాజకీయంగా పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించాలని అన్నారు. బీసీల సంక్షేమంకోసం నవరత్నాలు, రాజకీయంగా పదవులు, తగిన గుర్తింపు వైసీపీ ఇస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకటరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెం బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్

● ప్రయాణికుల అవస్థలు

నిడదవోలు, మార్చి 9: నిడద వోలు మండలం సమిశ్రగూడెం గడ్డర్ బ్రిడ్జిపై శనివారం ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. బ్రిడ్జిపై భారీ వాహనం రావడంతో ఒక్కసారిగా ఎదురు వెళ్లే వాహనాలకు దారిలేక సుమారు గంటకుపైగా కిలో మీ టర్ల మేర ట్రాఫిక్ నిలిచి పోయింది. బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన ఐరన్ గడ్డర్‌ను భారీ వాహనాలు ఢీకొట్టి లోపలకు రావడం ట్రాఫిక్ సమస్యలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయి. సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బందిని నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.



సమిశ్రగూడెం బ్రిడ్జిపై ట్రాఫిక్‌జామ్ దృశ్యం

విశ్వేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

కోరుకొండ, మార్చి9: కోరుకొండ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో చతుర్థశి సందర్భంగా శనివారం స్వామివారికి లక్ష బిల్వార్చన శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు స్వామివారికి నమక, చమకంలతో 11సార్లు ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. తదుపరి అన్నపూర్ణాదేవికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో పాటి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ జాజుల రాము, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు బోడెం శ్రీరాములు, మాజీ సర్పంచ్ తెలగంశెట్టి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ కాలచర్ల నాగు, నాగా రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి విశ్వనాధ శర్మ, మర్ల వెంకట గంగాధర సీతారామశాస్త్రి, బాపిరాజు శర్మ, మిరియాల శేషు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా

శేషారావును ప్రకటించాలి

● కోరుమామిడి గ్రామ టీడీపీ నాయకుల డిమాండ్



కోరుమామిడివద్ద శేషారావు ఎమ్మెల్యే అభ్యర్థి కావాలంటూ ప్రదర్శన నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నిడదవోలు, మార్చి 9: నిడదవోలు నియోజకవర్గ టీడీపీ, జన సేనల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం బూరుగుపల్లి శేషారావును ప్రకటించాలని నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. శనివారం నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామంలోని తారకరామ రైతు భవనంవద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల నాయకులు మా ట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా ప్రతిక్షణం ప్రజల్లోనే మనిషి బూరుగుపల్లి శేషారావు అని అన్నారు. అమరావతి రైతుల మహా పాదయాత్రను వైసీపీ ముష్కరులు నిడదవోలులో అడ్డగిస్తే బూ రుగుపల్లి శేషారావు భుజాన వేసుకుని ఆ పాదయాత్రను విజయ వంతం చేశారని అన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం రావాలంటే తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బూరుగుపల్లి శేషారావును అధిష్టానం ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రరావు, నిడదవోలు మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు, పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరం మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, ఈదూరి వెంకటేశ్వరరావు, కరుటూరి చౌదరి, పాతూరి నాగేశ్వరరావు, బుగ్గే శివరామకృష్ణశాస్త్రి, రాచమళ్ళ శ్రీనివాస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కొవ్వూరు మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలసు, కేంద్ర బలగాలు

మేమున్నాం..స్వేచ్ఛగా ఓటేయండి..

కొవ్వూరు, మార్చి 9 : రాబోయో సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కొవ్వూరు డీఎస్పీ సిహెచ్ రామారావు అన్నారు. శనివారం కొవ్వూరు మండలం పశివేదల, పంగిడి, ధర్మవరం, పెనకనమెట్ట, తోగుమ్మి మద్దూరు గ్రామాలలో ఆర్మ్‌డ్ సెంట్రల్ ఫోర్స్‌తో కవాతు చేపట్టారు. డీఎస్పీ సీహెచ్. రామారావు జెండా ఊపి కవాతును ప్రాంబించారు. డిఎస్పీ రామారావు మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా వారిలో స్ఫూర్తిని నింపి ప్రతిఓటరు పోలింగ్ కేంద్రానికి స్వచ్ఛందంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో గ్రామాల్లో కవాతు నిర్వహించామన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగపర్చకుండా, ప్రలోభాలకు గురికాకుండా అర్హతకలిగిన వ్యక్తులకు ఓటు వేయాలన్నారు. ఎవరైనా ప్రలోభపెట్టినా, భయాందోళనకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమఓటును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులకు స హకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు రూరల్ సిఐ పి. శ్రీనివాసరావు, ఎస్ఐ కె. సుధాకర్, పోలీసు స్సిబంది పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి : డీఎస్పీ

తాళ్ళపూడి, మార్చి 9 : త్వరలో జరుగనున్న ఎన్నికల దృష్ట్యా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతిఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పిస్తూ కొవ్వూరు డివిజన్‌కు కేటా యించిన కేంద్ర సాయుధ బలగాలతో కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు ఆధ్వర్యంలో తాళ్ళపూడి మండలంలో శనివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొవ్వూరు డీఎస్పీ రామారావు మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్‌కు 360 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీసు సిబ్బందిని కేటాయించారని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటి స్తూ ప్రజలకు తమ ఓటు హక్కు ధైర్యంగా వినియోగించుకోవాలని తెలుపుతున్నామన్నారు. ఎక్కడైనా ఎన్నికల సందర్భంగా ఇబ్బందులు ఎదురైనా పరిస్థితుల గురించి ఫిర్యాదు చేస్తే ఆ ప్రాంత ప్రజలకు పూర్తి రక్షణ మధ్య ఓటుహక్కు వినియోగించుకునేలా తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు సీఐ శ్రీనివాసరావు, తాళ్ళపూడి ఎస్ఐ శ్యాంసుందర్‌లు ఈ కవాతులో పాల్గొన్నారు.

కొవ్వూరు డివిజన్‌లో కేంద్ర బలగాల కవాతు



తాళ్ళపూడిలో కేంద్ర బలగాలు నిర్వహిస్తున్న కవాతు

కొవ్వూరు అసెంబ్లీ టిక్కెట్

టీవీకి కేటాయించాలి

● నిరసన తెలిపిన ఎంఆర్‌పీఎస్ నాయకులు



కొవ్వూరు మెరకవీధిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కొవ్వూరు, మార్చి 9 : కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్‌ను జనసేన తరపున మాదిగ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావుకు కేటాయించాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు లాగు రవి డిమాండ్ చేశారు. కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు సెంటర్‌లో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర రహదారిపై మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. రవి మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ టిక్కెట్ల కేటాయింపులో సామాజిక న్యాయం చేస్తానని చెప్పి మాదిగలకు అన్యాయం చేశారన్నారు. ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో జనసేన 3చోట్ల మాల సోదరులకు సీట్లు కేటాయించారని, మాదిగలకు ఒక్కసీటు కేటాయించలేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించి కొవ్వూరు అసెంబ్లీ టిక్కెట్‌ను మాదిగ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావుకు కేటాయించినట్లయితే అన్ని సామాజికవర్గ ప్రజలను, నాయకులను కలుపుకుని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పులపల్లి బాలకృష్ణ, గెడ్డం విజయ భాస్కర్, ముమ్మిడి రమణ, గల్లా అవినాష్, తిగిరిపల్లి వేణు, ఆండ్రపు మేరి పాల్గొన్నారు.

పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించాలి

నల్లజర్ల, మార్చి 9: రాష్ట్రంలో విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్‌సీ, డీఏ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని నల్లజర్ల మండల పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు ఐవీ సత్యం అన్నారు. శనివారం నల్లజర్ల హైస్కూల్‌లో మండల విశ్రాంత ఉద్యోగులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నా ప్రభుత్వం ఏరియర్స్‌పై ఊసెత్తడం లేదన్నారు. పీఆర్‌సీ కమిటీ నియమించినప్పటికీ దాని విధివిధానాలు రూపొందించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికల ముందు మధ్యంతర భృతి ప్రకటించేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీవీ అప్పారావు, బాలయ్య, ఎస్ఎం ఆలీసాహెబ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐవీ సత్యం

ఇందిరమ్మ అభయం పథకంపై

పోస్టర్ ఆవిష్కరణ



నిడదవోలు కాంగ్రెస్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిడదవోలు, మార్చి 9: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని రాష్ట్రంలోను దేశంలోను రాక్షసపాలన జరుగుతుందని కాంగ్రెస్‌పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి సుబ్బారావు అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఇందిరమ్మ అభయం పథకం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాపై మొదటి సంతకమని రాహుల్‌గాంధీ ప్రకటించారని అన్నారు. ప్రతినెలా పేదకు టుంబానికి ఐదువేల రూపాయలు ఇచ్చే ఇందిరమ్మ అభయం పథకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, పట్టణ అధ్యక్షుడు కారింకి వెంకటేశ్వరరావు, స్థానపతి ఉషారాణి, పెచ్చెట్టి కోటేశ్వరరావు, మండా శారద, పడాల అచ్యుత, బుద్దన లక్ష్మణ రావు, జిలానీ, జహా,ఖాశీమ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి పేద కుటుంబానికి ప్రతినెలా ఒకటవ తేదీన ఇందిరమ్మ అభయం పేరిట మహిళల అకౌంట్లో రూ.5000లు వేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తెలిపారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున కార్గె, పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి అనంతపురంలో జరిగిన సభలో ప్రకటించారన్నారు. కాంగ్రెస్ హామీ ఇస్తే నెరవేరుస్తుందని, కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. గందం బాబ్జి, పాలకుర్తి ప్రబాకర్, గెడ్డం సాయిబాబా పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందం అమలుచేయాలి



గౌరీపట్నంలో నిరసన తెలుపుతున్న లారీ కార్మికులు

దేవరపల్లి, మార్చి 9: నూతన వేతన ఒప్పందం వెంటనే అమలుచేయాలని వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎస్కే మస్తాన్, పీ.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం దేవరపల్లి మండలం గౌరీపట్నంలో లారీ కార్మికుల నూతన వేతన ఒప్పందంపై గత 15రోజుల క్రితం క్వారీక్రషర్ యాజమానులకు వివిధ కార్మిక సంఘాల యూనియన్ నాయకులు నోటీసులు ఇచ్చారని, గతంలో చేసుకున్న వేతన ఒప్పందం ఈనెల 9వ తేదీతో ముగిసిందని తిరిగి నూతనవేతన ఒప్పందం కోసం చర్చలు జరపాల్సి ఉందని ఈనెల 19వ తేదీన చర్చలు జరపటానికి సమయంకావాలని యజమానుల సంఘాన్ని కోరామన్నారు. 19వ తేదీన చర్చలు సఫలం కాకపోతే లారీ కార్మికులంతా ఆందోళనకు సిద్ధం కావాలని సమావేశంలో తీర్మానించామన్నారు. వివిధ కార్మిక సంఘం లారీ వర్క ర్ల సంఘం నాయకులు వై.దుర్గారావు, నాగరాజు, సూరి బాబు, వెంకన్న, కార్తీక్, వెంకటేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నవరం ట్రస్టు బోర్డు మెంబర్‌గా కటకం బాబ్జి

కోరుకొండ, మార్చి9: కోరుకొండ గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు కటకం బాబ్జి అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు దేవదాయ ధర్మదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆయనకు ఎండోమెంట్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. అనంతరం ఆయన శనివారం అన్నవరం దేవస్థానంలో పాలకమండలి సభ్యు లుగా ప్రమాణ స్వీకారం చేశారు.

మహిళలు స్వయం సాధికారత సాధించాలి

● మహిళా దినోత్సవంలో ఎంఈవో భగవతి

నల్లజర్ల, మార్చి 9 : మహిళలు స్వయం సాధికారత సాధించాలని ఎంఈవో భగవతి అన్నారు. శనివారం నల్లజర్ల హైస్కూల్‌లో మండల యూటీఎఫ్, మండలశాఖ ఆధ్వర్యంలో అసోషియేట్ అధ్యక్షురాలు కె.కృష్ణవేణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఒకరిపై ఆధారపడకుండా తాను పని చేస్తున్న రంగంలో వ్యక్తిగతంగా ఎదగాలని కోరారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణించడం గర్వకారణమన్నారు. మారుతున్న సమాజంలో కొన్నిచోట్ల మహిళలపై వివక్ష ఇంకా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలు అందరూ సమాజ మార్పు కోసం ప్రయత్నించాలన్నారు. అనంతపల్లి యూటీఎఫ్ మండలశాఖ ఎంఈవో భగవతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, సుబ్బాలక్ష్మి, శశికళ, జయలక్ష్మి, నిర్మల మండలశాఖ అధ్యక్షురాలు ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కిషోర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్ పాల్గొన్నారు.



నల్లజర్ల హైస్కూల్‌లో మహిళలను సత్కరిస్తున్న యూటీఎఫ్ మండల శాఖ

ఉద్యమాలతోనే హక్కుల సాధన : విజయగౌరి

చాగల్లు, మార్చి 9 : మహిళలు తమ హక్కుల సాధన ఉద్యమాలతోనే సాధ్యమని యూటీఎఫ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు విజయగౌరి అన్నారు. స్థానిక జూనియర్ బేసిక్ స్కూల్లో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఉండాలని అన్నారు. ఆశ వర్కర్లు సంఘం రాష్ట్ర నాయకురాలు కె.పోశమ్మ మాట్లాడుతూ మహిళలపైన, చిన్న పిల్లలపైన జరుగుతున్న అత్యాచారాలు నిర్మూలన చేయడానికి కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీస ర్ తనూజ, సాయిస్ఫూర్తి హాస్పిటల్ ఎండీ విజయరామరాజు, మండల యూటీఎఫ్ నాయకులు పిల్లి శ్రీనివాసమూర్తి, రాజశేఖర్, రవివర్మ, సీఐటీయూ నాయకుడు కె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయగౌరి

మునిసిపల్ డైమండ్ జూబ్లీ వేడుకలను ఖండిస్తూ నిరసన

నిడదవోలు, మార్చి 9: మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఈనెల 11న స్థానిక గణపతి సెంటరులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ మున్సిపల్ డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదమని ఈ నిర్ణయాన్ని రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని సీపీఎం నాయకులు మాజీ కౌన్సిలర్ జువ్వల రాంబాబు అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటువద్ద సీపీఎం, బీఎస్పీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమో క్రసి, టీడీపీ, జనసేనపార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నిడద వోలు ఎంతో చారిత్రాత్మక పట్టణమని ఈ పట్టణ అభివృద్ధిలో వివిధ రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు అన్నివర్గాల ప్రజలు ఎంతో కృషి చేసిన చరిత్ర ఉందన్నారు. అలాంటిది ఒక్క తమ పాలకవర్గమే అభివృద్ధి చేసినట్లు చెప్పు కొంటూ మున్సిపల్ డైమండ్ జూబ్లీ వేడుకలను ఏకపక్షంగా నిర్వహించాలనుకోవడం అన్ని రాజకీయపార్టీల నుంచి, అన్ని ప్రజా సంఘాల నుంచి ప్రజల నుంచి బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్‌కు ఏమాత్రం అవగాహన ఉన్నా అందరినీ కలుపుకుని అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి అప్పుడు డైమండ్ జూబ్లీ వేడుకలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బయ్యే మునీంద్ర, ఈమని గ్రీష్మ కుమార్, కైకరపు సత్యనారాయణ, ప్రకాష్, అంబటి పుల్లారావు పాల్గొన్నారు.



నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఫొటోగ్రాఫర్ సాయి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

కొవ్వూరు, మార్చి 9 : ఫొటోగ్రాఫర్ సాయి పవన్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శనివారంరాత్రి కొవ్వూరు ఏరియా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్, జిల్లా యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో కొవ్వూరు విజయవిహార్ సెంటర్ నుంచి పురవీధులలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వైజాగ్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్‌కల్యాణ్‌ను నమ్మించి వెడ్డింగ్ షూట్ పేరుతో రావులపాలెం రప్పించి దారుణంగా హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. సాయిపవన్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గెల్లా రాజు, కొవ్వూరు యూనియన్ అధ్యక్షులు ఉండవల్లి అప్పన శ్రీను, పోకల శ్రీనివాస్, బరీష్ శ్రీరంగం శ్రీనివాస్, సూరిబాబు, బాలు, పల్లంట్ల ప్రసాద్ పాల్గొన్నారు.



కొవ్వూరు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్లు

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	ఆపరేషన్ వాలంటైన్
వై.స్ర్కీన్ 2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	గామి
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	ఆపరేషన్ వాలంటైన్
శ్రీగణపతి	వ్యూహం
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్